



మినీ మహానాడు ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

నేడు జిల్లా టీడీపీ మినీ మహానాడు

రాజమహేంద్రవరం, మే 22(ఆంధ్రజ్యోతి) : తూర్పు గోదావరి జిల్లా మినీ మహానాడుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. స్థానిక చెరుకూరి కన్వెన్షన్ హాల్‌లో శుక్రవారం జిల్లాస్థాయి మినీ మహానాడు నిర్వహించనున్నారు.సుమారు 6వేల మంది హాజరవుతారని అంచనా వేస్తున్నారు. ఈ మేరకు మినీ మహానాడు ఏర్పాట్లను సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు పరిశీలించారు.ఈ నెల 27 నుంచి 29వ తేదీ వరకూ కడపలో జరగనున్న టీడీపీ మహానాడులో భాగంగా ముందస్తుగా జిల్లాల వారీగా మినీ మహానాడు నిర్వహిస్తున్నామన్నారు. జోన్-2 ఇన్‌చార్జి సుజయకృష్ణ హాజరవుతారన్నారు.సభా ప్రాంగణం,ఆయా ప్రాంతాల నుంచి వచ్చే ప్రతినిధుల సౌకర్యార్థం జిస్ట్రేషన్ కౌంటర్,భోజన ఏర్పాట్లు, పార్కింగ్ తదితర ఏర్పాట్లు చేశారు.జిల్లాలోని రాజమహేంద్రవరం సిటీ, రూరల్, రాజానగరం,అనపర్తి,నిడదవోలు, కొవ్వూరు, గోపాలపురం నియోజకవర్గాల నుంచి పార్టీ శ్రేణులు హాజరవుతారని చెప్పారు.

మహా పండుగ



కాకినాడ, బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లో టీడీపీ మినీ మహానాడు గురువారం పండగలా సాగింది.. ఆయా జిల్లాల నుంచి పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.. జై టీడీపీ.. జై జై టీడీపీ నినాదాలతో హోరెత్తించారు. కార్యకర్తలకు అండగా ఉండాలని నాయకులు ప్రతినబూనారు.



కాకినాడలో జరిగిన మినీ మహానాడుకు జిల్లా ఇన్‌చార్జి మంత్రి నారాయణ హాజరయ్యారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో నిర్వహించిన మినీ మహానాడుకు మంత్రి అచ్చెన్నాయుడు హాజరయ్యారు. కడపలో జరిగే మహానాడు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఆర్టీసీ జిల్లా అధికారిగా మూర్తి నియామకం

రాజమహేంద్రవరం అర్బన్, మే 22 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ తూర్పుగోదావరి జిల్లా అధికారిగా వై.సత్యనారాయణమూర్తి (వైఎస్ఎన్ మూర్తి) నియమితులయ్యారు.ప్రస్తుతం తాడేపల్లిగూడెం డిపో మేనేజర్‌గా పనిచేస్తున్నారు. జిల్లా అధికారిణిగా పనిచేసిన షర్మిల అశోక ఇటీవల బదిలీ కావడంతో ఆ స్థానంలో డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆర్టీసీ అధికారి రాఘవకుమార్ ఇన్‌ఛార్జిగా బాధ్యతలు అప్పగించారు. ఇదిలా ఉండగా వైఎస్ఎన్ మూర్తిని జిల్లా అధికారిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.సత్యనారాయణ మూర్తి ఒకట్రెండు రోజుల్లో బాధ్యతలు చేపట్టనున్నారు.

వక్ఫ్ బోర్డు నిర్వహణలోకి మదీనా మసీదు

రాజమహేంద్రవరం, మే 22 (ఆంధ్రజ్యోతి) : వక్ఫ్ బోర్డు నిర్వహణలోకి కొన్ని మసీదులను తీసుకుంటున్నారు. రాజమహేంద్రవరం దానవాయిపేటలోని మదీనా మసీదు తూర్పుగోదావరి వక్ఫ్ బోర్డు ప్రత్యక్ష నిర్వహణలోకి వెళ్లింది. ఈ నెల 20 నుంచి ఉత్తర్వులు అమల్లోకి వచ్చాయని కాకినాడ వక్ఫ్ బోర్డు ఆడిట్ ఇన్‌స్పెక్టర్ షైక్ తెలిపారు.



వదలని వరుణుడు

రాజమహేంద్రవరం, మే 22 (ఆంధ్రజ్యోతి): వరుణుడు వదలడం లేదు.. గత మూడు రోజులుగా ఏదో ఒక సమయంలో వర్షాలు పడుతూనే ఉన్నాయి. జిల్లాలో గురువారం 257.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. చాలా చోట్ల తెల్లవారుజాము నుంచి వర్షం కురవడం మొదలైంది. కడియం మండలంలో గరిష్ఠంగా 49.6 మిల్లీమీటర్లు, కనిష్ఠంగా బిక్కవోలులో 0.4 మిలీమీటర్లు, జిల్లా కేంద్రం రాజమహేంద్రవరం అర్బన్‌లో 4.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

కలలోను!



కార్పొరేషన్ రుణాలకు స్మాల్ బ్రేక్

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో బీసీ, ఎస్సీ, ఈబీసీ, కాపు కార్పొరేషన్ ద్వారా ఇవ్వనున్న స్వయం ఉపాధి రుణ యూనిట్లకు బ్రేక్ పడింది. వీటిని తక్షణం నిలిపివేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఎంపిక చేసిన లబ్ధిదారులకు సబ్సిడీ, రుణం మంజూరు ఆపేయాలని సూచించింది. త్వరలో భారీగా అదనపు రుణ యూనిట్లు, లబ్ధిదారులను పెంచడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ కీలక నిర్ణయం తీసుకుంది.



5,137 యూనిట్లు..

గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో కార్పొరేషన్లను పూర్తిగా నిర్వీర్యం చేసింది. పేదలకు ఒక్క యూనిట్ కూడా మంజూరు చేయకుండా ఆపేసింది. ప్రస్తుత ప్రభుత్వం తిరిగి ఇటీవల వీటిని పునరుద్ధరించింది. సీఎం చంద్రబాబు మళ్లీ కార్పొరేషన్ల ద్వారా బీసీ, కాపు, ఎస్సీ, ఈడబ్ల్యూఎస్ వర్గాలకు స్వయం ఉపాధి యూనిట్లు మంజూరు చేయాలని నిర్ణయించారు. వ్యాపారాన్ని బట్టి ప్రభుత్వం 40 నుంచి 60 శాతం సబ్సిడీ, మిగిలింది బ్యాంకు రుణం, ఐదు శాతం వరకు లబ్ధిదారుడి వాటా కింద విభజించారు. ఈ రెండు కార్పొరేషన్ల ద్వారా రూ.316 కోట్ల విలువైన స్వయం ఉపాధి యూనిట్లను పేద యువతకు అందించి వారిని ఆర్థికంగా నిలబెట్టేందుకు నిర్ణయించింది. బీసీ, ఎస్సీ కార్పొరేషన్ల ద్వారా ఉమ్మడి జిల్లాకు 5,137 యూనిట్లను మంజూరు చేసి దరఖాస్తులు ఆహ్వానించింది. ఏకంగా 45,765 మంది పోటీపడ్డారు. అనేకమందికి పథకం అందని పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో మళ్లీ యూనిట్లను పెంచి మరింత మందికి లబ్ధి చేకూర్చాలని ప్రభుత్వం భావిస్తోంది. దీనిలో భాగంగా ప్రస్తుతం అర్హుల ఎంపికను నిలిపివేసి కొత్తగా మరింత మందిని ఎంపిక చేసి అందరికీ ఒకేసారి ఈ పథకం అమలు చేయడం కోసమే తక్షణ నిర్ణయమని చెబుతున్నారు.

లబోదిబో...

ఐదేళ్ల తర్వాత పథకం అమలవుతుండడంతో యూనిట్లను దక్కించుకునేందుకు వేలాదిగా పోటీపడడంతో కేవలం వందల్లో మాత్రమే లబ్ధిదారులు రుణాలకు ఎంపికయ్యారు. ఎంపిక కాని వేలాది మంది పేద యువత, నిరుద్యోగులు తమకు న్యాయం చేయాలంటూ అనేక చోట్ల ఎమ్మెల్యే వద్దకు క్యూ కట్టారు. ఇన్నేళ్లు నిరీక్షిస్తే తమకు ఇంకెప్పుడు న్యాయం జరుగుతుందంటూ విజ్ఞప్తులు అందించారు. దీంతో


- కలవరింత... పెంపు మరింత
- జాబితాలు నిలిపేయాలని ఆదేశం
- యూనిట్లు తక్కువవడమే కారణం
- కార్పొరేషన్లకు 5,137 యూనిట్లు
- 45,765 దరఖాస్తులు
- వందల్లో ఎంపికైన లబ్ధిదారులు
- అనేక మందికి దక్కని అవకాశం
- ఎమ్మెల్యేలను నిలదీస్తున్న వైనం
- పెంచాలని ప్రభుత్వంపై ఒత్తిడి
- త్వరలో భారీగా పెంచే యోచన
- యూనిట్ల పెంపుపై కసరత్తు
- అందుకే నిలిపివేసిన ప్రభుత్వం

అనేక మంది ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎమ్మెల్యేలు విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు. వందల్లో రుణ యూనిట్లు సరిపోవని వివరించారు. క్షేత్ర స్థాయి పరిస్థితులపై అధికారుల ద్వారా నివేదిక రప్పించుకున్న ఉన్నతాధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ప్రస్తుతం కేటాయించిన యూనిట్లు చాలా తక్కువగా ఉన్న నేపథ్యంలో ఇవి రెట్టింపు చేయాల్సిన అవసరం ఉందనే చర్చ ప్రభుత్వంలో జరిగింది. రెట్టింపు చేయాలా? ఇంకా పెంచాలా? అనేదానిపై ప్రస్తుతం ఉన్నత స్థాయిలో కసరత్తు జరుగుతోంది. ఈ సంగతి తేల్చే వరకు ఇది వరకే ఎంపిక చేసిన లబ్ధి దారుల జాబితా నిలిపివేయాలని అధికారులు నిర్ణయించారు. పెంచబోయే యూనిట్లను కలిపి అందరికే ఒకేసారి పథకం వర్తింపజేయాలని జిల్లాల్లో అధికారులకు సమాచారం అందింది. దీంతో ప్రస్తుతం మండల స్థాయిలో పథకాలకు ఎంపికై బ్యాంకు రుణాలకు ఎదురుచూస్తోన్న లబ్ధిదారులను హోల్డ్‌లో ఉంచారు. ఈ నేపథ్యంలో బీసీ కార్పొరేషన్ కింద మంజూరైన 1,042, ఈడబ్ల్యూఎస్ కార్పొరేషన్ కింద మంజూరైన 73, కాపు కార్పొరేషన్ కింద ఎంపికచేసిన 570 లబ్ధిదారులను నిలిపివేశారు. త్వరలో భారీ స్థాయిలో యూనిట్లను పెంచి ఎక్కువమంది యువతకు పథకాన్ని అమలుచేయనుంది.

వందల్లో యూనిట్లు.. వేలల్లో దరఖాస్తులు

ఐదేళ్ల తర్వాత మళ్లీ పథకం అమల్లోకి రావడంతో యూనిట్లు వంద ల్లో ఉంటే దరఖాస్తుదారులు వేలల్లో వచ్చారు. బీసీ కార్పొరేషన్ రుణాల కింద కాకినాడ జిల్లాకు రూ.39.52 కోట్ల విలువైన 1,914 యూనిట్లు మంజూరు చేస్తే ఏకంగా 31,859 మంది, తూర్పుగోదావరి జిల్లాలో రూ.28.87 కోట్ల విలువైన 1,374 యూనిట్లకు 16,408 మంది, కోనసీమ జిల్లాలో రూ.29.54 కోట్ల విలువైన 1,394 యూనిట్లకు 15,147మంది పోటీపడ్డారు.కాపు కార్పొరేషన్ కింద రూ.28.24 కోట్ల విలువైన 763 యూనిట్లకు 21,454, తూర్పుగోదావరి జిల్లాలో రూ.27.15 కోట్ల విలువైన 757 యూనిట్లకు 8,193 మంది, కోనసీమ జిల్లాలో రూ.27.14 కోట్ల విలువైన 757 యూనిట్లకు 15,644 మంది పోటీ పడ్డారు. ఈడబ్ల్యూఎస్ కార్పొరేషన్ కింద ఉమ్మడి జిల్లాకు రూ.14 కోట్ల విలువైన 511 యూనిట్లు మంజూరు చేయగా, రూ.6 వేల మంది వరకు దరఖాస్తులు చేశారు. ఎస్సీ కార్పొరేషన్ కింద కాకినాడ జిల్లాకు 798 యూనిట్లు మంజూరవగా 5,497, కోన సీమ జిల్లాకు 1,043 యూనిట్లకు 3,265 మంది, తూర్పుగోదావరి జిల్లాలో 891 యూనిట్లకు 4,555 మంది దరఖాస్తు చేశారు.

కిలో నెయ్యి.. రూ.250



ఆత్రేయపురం పూతరేకుల్లో కల్తీ నెయ్యి

ఆత్రేయపురం, మే 22 (ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం పేరు చెప్పగానే గుర్తుకు వచ్చేది పూతరేకులే.. రోజూ కోట్లాది రూపాయల వ్యాపారం.. ఆ వ్యాపారానికి నెయ్యి ఎక్కడి నుంచి వస్తుందనేది ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది. ఎందుకంటే నెయ్యి వాడని పూతరేకు ఉండదు. ఎన్నో ఏళ్ల కిందట ఆత్రేయపురంలో పుట్టిన పూతరేకుకు దేశ విదేశాల్లో ఎంతో డిమాండ్ ఉంది. మహిళలు కుటీర పరిశ్రమగా పూతరేకులు తయారుచేస్తూ ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారు. పూతరేకులకు డిమాండ్ పెరగడంతో అక్రమార్కులు ఎక్కడపడితే అక్కడ పూతరేకుల వ్యాపారాలు సాగిస్తూ కల్తీ నెయ్యి వినియోగిస్తూ అమ్మకాలు సాగిస్తున్నారు.

- విచ్చలవిడిగా అమ్మకాలు
- పూతరేకుల్లో వినియోగం
- పశువుల కొవ్వు నుంచి తయారీ
- చిరు వ్యాపారులతో అమ్మకాలు
- ప్రజారోగ్యంతో చెలగాటం

ఆత్రేయపురంలో రోడ్ల వెంబడి ఉన్న దుకాణాల్లో కొందరు వ్యాపారులు గత కొంతకాలంగా యథేచ్ఛగా నకిలీ నెయ్యిని వినియోగిస్తూ ప్రజల ఆరోగ్యాలతో చెలగాటం ఆడుతున్నారు. పశుమాంసం ద్వారా కొవ్వును తీసి కల్తీ నెయ్యి తయారు చేస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. ఒరిజినల్ నెయ్యిలా ఉండేలా కొన్ని మిశ్రమాలు కలిపి ఈ కల్తీ నెయ్యిని తయారు చేస్తున్నట్టు సమాచారం. ఏలూరు, విజయవాడ, విశాఖపట్నం తదితర ప్రాంతాల నుంచి ఈ నకిలీ నెయ్యిని తెచ్చి వ్యాపారుల ద్వారా అమ్మకాలు సాగిస్తున్నారు. ఆత్రేయపురంలోని కొన్ని షాపుల ద్వారా ఈ నెయ్యి వ్యాపారం యథేచ్ఛగా సాగిపోతోంది. ఈ కల్తీ నెయ్యిని కిలో రూ.250కు చిరువ్యాపారులకు విక్రయిస్తున్నారు. ధర తక్కువగా ఉండడం.. చూస్తే నెయ్యిలా కనిపించడంతో ఆ నెయ్యినే వినియోగించి కొందరు పూత రేకులు తయారుచేస్తున్నారు. ఈ కల్తీనెయ్యి విచ్చలవిడిగా వినియోగించడం ద్వారా ప్రజలు ఆరోగ్యానికి తూట్లు పొడుస్తున్నారు. క్యాన్సర్, ఉదర సంబంధిత వ్యాధులు సంభవించే అవకాశాలు ఉన్నాయని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. గత ఫిబ్రవరి నెలలో ఫుడ్‌సేఫ్టీ అధికారులు పూతరేకుల తయారీ, నెయ్యి వ్యాపారుల స్థావరాలపై దాడులు చేసి కేసులు పెట్టినా షరామామూలే.



అధికారులు పట్టుకున్న కల్తీ నెయ్యి

80 కిలోల కల్తీ నెయ్యి స్వాధీనం

ఆత్రేయపురంలోని కల్తీ నెయ్యి అమ్మకాలు సాగిస్తున్న ఓ షాపుపై స్థానికులు గుర్తించి పోలీస్, రెవెన్యూ అధికారులకు సమాచారం అం దించారు. ఆత్రేయపురం శ్రీలక్ష్మి డ్రైఫ్రూట్స్ షాపులో గురువారం 80 కిలోల కల్తీనెయ్యిని పట్టుకుని స్థానికులు పోలీస్, రెవెన్యూ అధికారులకు సమాచారం అందించారు. షాపునకు చెందిన గొడౌన్లలో అమ్మకానికి సిద్ధంగా ఉన్న 80 కిలోల కల్తీనెయ్యిని స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఎస్ఐ రాము ఫుడ్‌సేఫ్టీ అధికారులకు సమాచారం అందించారు. ఫుడ్‌సేఫ్టీ అధికారి శ్రీకాంత్‌చౌదరి కల్తీ నెయ్యి సీజ్ చేశారు. శాంపిల్స్ ల్యాబ్‌కు పంపి తదుపరి చర్యలు చేపడతామని తెలిపారు.



సంచుల్లో నిల్వ ఉంచిన కల్తీ నెయ్యి ప్యాకెట్లు

బొమ్మూరులోనే కలెక్టరేట్!



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి, జేసీ చిన్నరాముడు

- త్వరలో సైన్స్ మ్యూజియం ఆరంభం
- ఇసుక డ్రెడ్జింగ్‌పై నిఘా ఉంది
- జూన్ 21 వరకూ రోజూ యోగా
- వై.జంక్షన్-లాలాచెరువు సందడి
- 29న సెంట్రల్ జైలులో ప్రోగ్రాం
- కలెక్టర్ ప్రశాంతి వెల్లడి

రాజమహేంద్రవరం,మే22(ఆంధ్రజ్యోతి) : జిల్లా కలెక్టరేట్ బొమ్మూరులో ఉంటుందనే అభిప్రాయం కలెక్టర్ వ్యక్తం చేశారు. కలెక్టర్ క్యాంపు ఆఫీసులో జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి గురువారం విలేకరులు అడిగిన పలు ప్రశ్నలకు స్పందించారు. జిల్లా కలెక్టరేట్ శాశ్వత భవనాలు ఎక్కడ కట్టడానికి నిర్ణయించారని ఒకరు అడగ్గా.. బొమ్మూరులోని ప్రస్తుత కలెక్టరేట్‌కు అందరూ అలవాటు పడ్డారు కదా అని ఆమె చెప్పారు. గత పుష్కరాల సమయంలో శాంక్షన్ అయిన సైన్స్ మ్యూజియంను నిర్మించినా ఎపుడు ప్రారంభిస్తారని ఒకరు ప్రశ్నించగా అదే ఏర్పాట్లలో ఉన్నట్టు స్పష్టం చేశారు. రివర్ ఫ్రంట్ నిర్మాణం వల్ల మహనీయుల విగ్రహాలు తొలగిస్తారని, పిండాల సత్రాన్ని తొలగిస్తారట కదా అని మరొకరు ప్రశ్నించారు. రివర్ ఫ్రంట్ అభివృద్ధిలో భాగంగా మహనీయుల విగ్రహాలను గౌరవప్రదంగా తొలగించి తర్వాత ఏర్పాటు చేస్తామన్నారు. కంబాల సత్రం గురించి ఆరా తీస్తానని తెలిపారు. ఇసుక డ్రెడ్జింగ్‌పై నిఘా ఉందని కేసులు నమోదు చేస్తున్నామన్నారు. జిల్లాలో 7లక్షల టన్నుల ఇసుక స్టాక్ చేయడం లక్షంగా ర్యాంపులు ఇచ్చినట్టు చెప్పారు. తెలుగు విశ్వవిద్యాలయానికి ప్రస్తుతం ఉన్న ప్రాంగణంలో 15 ఎకరాల భూమి ఉందని చెప్పారు. టాటా ఇన్నోవేషన్ హబ్‌కు ఐదెకరాల భూమితో పాటు ఓ ప్రైవేట్ భవనాన్ని చూశామని, ఇది గెయిల్, ఓఎన్‌జీసీ ,ఇతర ప్రైవేట్ సంస్థల ఆధ్వర్యంలో నడుస్తుందని, అధికారుల పాత్ర తక్కువ ఉంటుందన్నారు.

యోగాపై అవగాహన పెంచండి

రాజమహేంద్రవరం అర్బన్, మే 22 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రాన్ని యోగాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యంగా జరుగుతున్న కార్యక్రమంలో భాగంగా జిల్లాలో నెల రోజుల పాటు యోగా సాధన కార్యక్రమాలు ఉంటాయని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో గురువారం యోగాంధ్రప్రదేశ్ కార్యక్రమంపై సమన్వయశాఖల అధికారులతో సమీక్షించారు. జూన్ 1న రాష్ట్రవ్యాప్తంగా 2 కోట్ల మందితో రికార్డుస్థాయిలో యోగా చేయించాలనే లక్ష్యంలో భాగంగా నగరంలోని రాజమహేంద్రవరంలోని వై.జంక్షన్ నుంచి లాలాచెరువు వరకూ ప్రతిరోజూ ఉదయం 7 నుంచి 8 గంటల మధ్య యోగా సాధన కార్యక్రమాలు చేపట్టనున్నట్టు తెలిపారు. రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో రాష్ట్రస్థాయి కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు. ఈ కార్యక్రమాల్లో మీడియా కూడా భాగస్వామ్యం కావాలన్నారు. రోజుకు ఒక శాఖ చొప్పున నెల రోజులపాటు అన్ని శాఖలు యోగా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ప్రజల్లో యోగా పట్ల అవగాహన పెంచాలని సూచించారు. డివిజన్లలో ఆర్డీవోలు కో ఆర్డినేటర్‌గా కార్యక్రమాలు చేపడతారన్నారు.కార్యక్రమంలో జేసీ చిన్నరాముడు, జైళ్లశాఖ ఎస్పీ రాహుల్, డీఆర్వో సీతారామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ కోవిడ్ కలకలం

అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలు

రాజమహేంద్రవరం అర్బన్, మే 22 (ఆంధ్రజ్యోతి) : కొవిడ్‌తో అప్ర మత్తంగా ఉండాలని డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్‌హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ ఉన్నతాధికారులు కొవిడ్ ముందస్తు హెచ్చరికలు జారీ చేశారు. దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో కొవిడ్ కేసులు నమోదవుతున్న నేపథ్యంలో ముందస్తుగా హెచ్చరించారు. ఈ మేరకు రాజమహేంద్రవరం ప్రభుత్వ బోధనాసుపత్రితో సహా జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రులకు, వైద్యాధికారులకు స్పష్టమైన ఆదేశాలిచ్చారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మార్గనిర్దేశం చేశారు. ప్రజలు ఎలాంటి అనుమానిత లక్షణాలు కనిపించినా తగు జాగ్రత్తలు తీసుకోవడంతోపాటు చికిత్స తీసుకోవాలని సూచించారు. హెల్త్ డిపార్టుమెంట్ 24/7 అప్రమత్తంగా ఉండాలని, మాస్కులు సిద్ధం చేసుకోవాలని, పీపీఈ కిట్లు అందుబాటులో ఉంచుకోవాలని, ట్రిపుల్ లేయర్ మాస్కులను రెడీ చేసుకోవాలని, అన్ని రకాలైన టెస్టింగ్ సౌకర్యాలతో ల్యాబ్‌లను సిద్ధం చేసుకోవాలని ఆదేశాల్లో పేర్కొన్నారు.



రెక్కలు కొట్టుకుంటున్నాయ్!

ఫ్యాన్ పార్టీలో ముదిరిన వివాదం

- నాడు రాజా వర్సెస్ భరత్
- నేడు వేణు వర్సెస్ భరత్
- పరిశీలకుడు వచ్చినా గైర్హాజరు
- మాజీ ఎంపీ తీరుపై అసహనం
- ఇటీవల క్లాస్..మారని తీరు



వైసీపీ పరిశీలకుడు తిప్పల గురుమూర్తి రెడ్డి నిర్వహించిన సమావేశానికి హాజరైన నాయకులు

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

అధికారం కోల్పోయినా వైసీపీ నేతలకు గుణపాఠం రావడం లేదు. కొందరు తమ వైఖరిని మార్చుకోకపోతుంటే.. కొందరు మధ్య ఆధిపత్య పోరు పెరిగింది. అధికారంలో ఉండగా, అప్పట్లో ఎంపీగా ఉన్న మార్గాని భరత్‌రామ్, అప్పట్లో ఎమ్మెల్యేగా ఉన్న జక్కంపూడి రాజా మధ్య తీవ్రస్థాయిలో విభేధాలు పొడచూపిన సంగతి తెలిసిందే. అయినా ఎవరికి వారు తమ వర్గాని పోషించుకుంటూ వచ్చారు. గత ఎన్నికల్లో అందరూ ఓడిపోయారు. రాజమహేంద్రవరం రూరల్ నుంచి వైసీపీ అభ్యర్థిగా మాజీ మంత్రి చెల్లుబోయిన వేణు పోటీ చేసిన సంగతి తెలిసిందే. ఆయన ప్రస్తుతం వైసీపీ జిల్లా అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. ఏమి జరిగిందో కానీ మాజీ మంత్రి వేణు, మాజీ ఎంపీ భరత్ మధ్య గ్యాప్ బాగా పెరిగింది. కొద్ది రోజుల కిందట వీరి వ్యవహారం అధిష్ఠానం వద్ద పంచాయితీకి కూడా దారితీయడం గమనార్హం. జగన్ ఆదేశాల మేరకు మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ, సజ్జల రామకృష్ణారెడ్డి వీరిద్దరినీ పిలిచి క్లాస్ తీసుకున్నట్టు సమాచారం. వేణు జిల్లా అధ్యక్షుడిగా అందరినీ కలుపుకుని పోకుండా, తనకు వ్యతిరేకంగా కొందరితో చేతులు కలిపినట్టు భరత్ ఆరోపించినట్టు తెలిసింది.కానీ తాను జిల్లా అధ్యక్షుడిగా చేపట్టిన కార్యక్రమాలు కాకుండా భరత్ ఒంటెత్తు పోకడతో వెళుతున్నట్టు వేణు వాదించినట్టు సమాచారం. కానీ అధిష్ఠానం వీరిద్దరికి గట్టిగా చెప్పి పంపించడం గమనార్హం. కానీ అయినా వారి మధ్య సయోధ్య కుదిరినట్టు లేదు. రాజమహేంద్రవరం పార్లమెంట్ ఇన్‌చార్జి వైసీపీ పరిశీలకుడిగా తిప్పల గురుమూర్తి రెడ్డి గురువారం జిల్లాలోని నియోజకవర్గాల ఇన్‌చార్జిలతో సమావేశం నిర్వహించారు. బొమ్మూరులోని వైసీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి చెల్లుబోయిన వేణు కార్యాలయంలో వేణు అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి మాజీ ఎంపీ మార్గాని భరత్ హాజరు కాలేదు. ఆయన హైదరాబాద్ వెళ్లినట్టు సమాచారం.సమావేశంలో మాజీహోం మంత్రి తానేటి వనిత, యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జి డా.గూడూరి శ్రీనివాస్,మాజీ ఎమ్మెల్యేలు డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, తలారి వెంకట్రావు, జి. శ్రీనివాసనాయుడు పాల్గొన్నారు.

జిల్లా ఓటర్లు 16,21,270

డీఆర్వో సీతారామ మూర్తి

రాజమహేంద్రవరం,మే 22 (ఆంధ్రజ్యోతి): పోలింగ్ కేంద్రాల్లో ఓటర్ల సంఖ్య హేతుబద్ధీకరణకు చర్యలు తీసుకుంటున్నామని, రాజకీయ పార్టీలు తమ వంతుగా సహకరించాలని జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్వో) టి.సీతారామమూర్తి కోరారు. కలెక్టరేట్‌లో గురువారం సాయంత్రం వివిధ రాజకీయ పార్టీలో ప్రతినిధులతో ఆయన సమావేశం నిర్వహించారు. జిల్లాలోని 1581 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. 1191 కేంద్రాల్లో 1200 మంది కంటే తక్కువ ఓటర్లు ఉండగా.. మిగతా వాటిలో 1200 కంటే ఎక్కువగా ఉన్నారని తెలిపారు. హేతుబద్ధీకరణ ద్వారా సమంగా ఉండేలా చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు. క్షేత్ర స్థాయిలో పరిశీలనకు రాజకీయ పార్టీల సూచనలు, సలహాలు తీసుకుంటున్నామన్నారు. జిల్లాలో 16,21,270 మంది ఓటర్లు ఉన్నారన్నారు. ఈ ఏడాది జనవరి 6 నుంచి ఇప్పటి వరకూ 10,630 ఫారం 6, 7, 8 స్వీకరించగా..10,620 పరిష్కరించామన్నారు. ఎవరైనా కొత్త ఓటర్లు ఉంటే దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

జలకాలాటలలో...

నగరాలు, పట్టణాల్లో ఉండే పిల్లలకు ఎంజాయ్ చేయడానికి స్విమ్మింగ్ పూల్స్ ఉంటాయి... మరి మారుమూల పల్లెల్లో నివసించే పిల్లలకు చెరువులు, కాలువలే ఆధారం... ఈ చిత్రం చూస్తే అలానే అనిపిస్తోంది కదూ... కాకినాడ జిల్లా తుని మండలం గవరపేటకు చెందిన కుర్రాళ్లు వేసవి తాపం నుంచి ఉపశమనం పొందేందుకు ఊరి చివరన ఉన్న ఓ పురాతన బావిలోకి దూకి ఇలా స్నానాలు చేస్తూ సందడి చేశారు.







ఫొటోలు: స్టాఫ్ ఫొటోగ్రాఫర్, కాకినాడ



కాకినాడ జిల్లా సమీక్షా కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి నారాయణ. చిత్రంలో కలెక్టర్ షాన్‌మోహన్, పెద్దాపురం, కాకినాడ రూరల్ ఎమ్మెల్యేలు చినరాజప్ప, నానాజీ, ఎమ్మెల్సీ పద్మశ్రీ, జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, కాకినాడ కమిషనరు భావన

ఏలేరు కాల్వల గండ్లు అన్నింటినీ

వర్షాకాలానికి ముందే పూడ్చాలి

- గత సమావేశంలో చర్చించిన అంశాల్లో 75శాతం పూర్తి చేశారు
- పీఎం సూర్యఘర్ కింద 75వేల గృహాలకు సోలార్ యూనిట్లు ఏర్పాటు చేయాలి
- కాకినాడ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగూరు నారాయణ

కలెక్టరేట్ (కాకినాడ), మే 22 (ఆంధ్రజ్యోతి): గత సంవత్సరం వరదల కారణంగా ఏలేరు వ్యవస్థలో కాల్వలకు పడిన గండ్లు అన్నింటినీ వర్షాకాలానికి ముందే పూడ్చాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ అధికారులను ఆదేశించారు. కాకినాడ జిల్లా సమీక్షా కమిటీ సమావేశం గురువారం ఆయన అధ్యక్షతన కలెక్టరేట్‌లో జరిగింది. కలెక్టర్ షాన్‌మోహన్, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, ఎమ్మెల్యేలు నిమ్మకాయల చినరాజప్ప, పంతం నానాజీలతో కలిసి జిల్లా అభివృద్ధికి సంబంధించి వివిధ అంశాలపై అధికారులతో సమీక్షించారు. గత డీఆర్సీ సమావేశంలో చర్చించిన అంశాల్లో 75శాతం పనులు పూర్తి చేశామన్నారు. మిగిలిన పనులను కూడా త్వరలో పూర్తిచేస్తామని కలెక్టర్ వివరించారు. మంత్రి నారాయణ మాట్లాడుతూ జిల్లాలో పీఎం సూర్యఘర్ ముఫ్తి బిజిలి పథకం కింద 75వేల సోలార్ రూఫ్ టాప్ యూనిట్లు ఏర్పాటు చేసామన్నారు. దీనిలో 52వేల యూనిట్లను ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు ఇస్తామన్నారు.

కలెక్టర్ షాన్‌మోహన్ మాట్లాడుతూ కిసాన్ డ్రోన్ల వల్ల రైతులకు, డ్రోన్ నిర్వాహకుడికి ఏడాదికి దాదాపు 6.33లక్షల ఆదాయం చేకూరుతుందని అధ్యయనంలో నిర్ధారణ అయ్యిందన్నారు. వ్యవసాయ రంగంలో డ్రోన్ల యజమానికి చేకూరే ఆర్థిక ప్రయోజనాలపై క్షేత్ర పరిశీలన చేశామన్నారు. డ్రోన్ల వినియోగం వలన రైతులకు ఖర్చు, సమయం ఆదా అవుతున్నాయన్నారు. జిల్లాలో పాఠశాలల పునర్ వ్యవస్థీకరణ, నైపుణ్యాల శిక్షణ, ఉద్యోగమేళాల నిర్వహణ ద్వారా యువతకు ఉపాధి అవకాశాల కల్పనకు చేపట్టిన చర్యలను మంత్రికి కలెక్టర్ వివరించారు. పట్టణ, గ్రామీణ ఆవాసాల్లో వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చేపట్టిన చర్యలను కాకినాడ కార్పొరేషన్ కమిషనర్ భావన, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ వివరించారు.

పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప మాట్లాడుతూ గత ఏడాది వరదల వలన ఏలేరు వ్యవస్థలో పడిన గండ్లను వెంటనే పూడ్చించాలన్నారు. సామర్లకోట బైపాస్, ఏడీబీ రోడ్డు విస్తరణ పనులను సత్వరం పూర్తి చే యాలన్నారు.

కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ ఆక్వా చెరువుల వ్యర్థ జలాల వలన పంట పొలాలకు జరుగుతున్న నష్టాన్ని వివరించారు. మిల్లర్లు కుమ్మక్కై తక్కువ ధర చెల్లిస్తున్నందున నష్టపోతున్న రైతులను ఆదుకోవాలని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ కోరారు. జనసేన పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ అకాల వర్షాల నుంచి ధాన్యాన్ని కాపాడేందుకు మరింత ఎక్కువ సంఖ్యలో టార్పాలిన్లను రైతులకు పంపిణీ చేయాలని కోరారు.

ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ మాట్లాడుతూ పాలిటెక్నిక్ విద్యార్థులు ఎదుర్కొంటున్న హాస్టల్ సమస్యలను అధికారులు పరిష్కరించాలని కోరారు. జయలక్ష్మి మాక్ సొసైటీ, కిర్లంపూడి, ఏలేశ్వరం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో జరిగిన అక్రమాలపై సత్వరం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

మంత్రి నారాయణ మాట్లాడుతూ సభ్యులు సమావేశంలో చర్చించిన అంశాలపై సత్వరం చర్యలు తీసుకోవాలన్నారు. ఏలేరు సాగునీటి వ్యవస్థలో కాలువలకు గత ఏడాది వరదల సమయంలో పడిన గండ్లు అన్నింటినీ ఖరీఫ్ సాగుకు ముందే పూడ్చాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. పీఎం సూర్యఘర్ కింద టిడ్కో గృహాలపైన కూడా సోలార్ యూనిట్లు ఏర్పాటు చేయాలని ట్రాన్స్‌కో అధికారులను ఆదేశించారు. పటిష్టమైన వేసవి కార్యాచరణతో బోర్లు రిపేర్లు, నీటి రవాణా వంటి చర్యలతో జిల్లాలో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రైతులు అమ్మే ధాన్యానికి మద్దతు ధర ఇవ్వాలన్నారు. రైతులకు మరిన్ని టార్పిలిన్లు సబ్సిడీపై సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. గత సమావేశంలో చర్చించిన అంశాల్లో 75 శాతం పరిష్కారం అయ్యాయని చెప్పారు.

సమావేశంలో జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, డీఎఫ్‌వో రవీంద్రనాథ్‌రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు, పాడా ప్రాజెక్టు డైరెక్టర్ ఎ.చైత్రవర్షిణి, వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ విజయ్‌కుమార్, ట్రాన్స్‌కో ఎస్ఈ ప్రసాద్, ఇరిగేషన్ ఈఈ శేషగిరిరావు పాల్గొన్నారు.

పాపికొండలు నేషనల్ పార్కులో

ఎకో అటవీ పరిరక్షణ జోన్

- అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్
- రంపచోడవరం ఐటీడీఏ కార్యాలయంలో అధికారులతో సమావేశం

రంపచోడవరం, మే 22 (ఆంధ్రజ్యోతి): పాపికొండలు నేషనల్ పార్కులో కేంద్ర ప్రభుత్వం, సుప్రీంకోర్టు నిబంధనల ప్రకారం ఎకో అటవీ పరిరక్షణ జోన్ ఏర్పాటు చేస్తామని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ అన్నారు. గురువారం ఆయన రంపచోడవరంలోని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కార్యాలయ చాంబర్‌లో చీఫ్ కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ బీఎన్ఎన్ మూర్తి, ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం, డీఎఫ్‌వో రవీంద్ర ధామ, భవిత జిల్లా స్థాయి అధికారులతో కలిసి పాపికొండలు నేషనల్ పార్కు విధి విధానాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాపికొండలు నేషనల్ పార్కు ఏర్పాటుకు సంబంధిత గ్రామాల్లో గ్రామసభలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. రంపచోడవరం, దేవీపట్నం, మారేడుమిల్లి మండలాల్లోని 10 గ్రామాలు, చింతూరు డివిజన్లో 12 గ్రామాలు ఉన్నట్టు తెలిపారు. గ్రామసభలు ఏర్పాటుచేసే గ్రామాల ప్రజలకు ముందుగా నోటీసులు జారీ చేయా లన్నారు. నేషనల్ పార్కు ప్రాంతంలో ఎన్ని కుటుంబాలకు అవార్డులు మంజూరైంది.... ఇంకా ఎన్ని కుటుంబాలకు మంజూరు కావాల్సి ఉందో తెలపాలన్నారు. త్వరితగతిన గ్రామసభలు నిర్వహించాలని డీఎల్పీవో పద్మను ఆదేశించారు. సమావేశంలో సబ్ డీఎఫ్‌వోలు అనూష, రాఘవ, అటవీ రేంజ్ అధికారులు ఏడుకొండలు, ఫిరోజ్, డి.కొండలరావు, ఈఈ ఐ.శ్రీనివాసరావు, ఏడీఏలు సీహెచ్‌కేవీ చౌదరి, కె.సావిత్రి, డీఈ సాయిసతీష్, డిప్యూటీ సర్వే ఆఫ్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్, ఎన్జీవో ప్రతినిధి గొర్లె అనుదీప్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ దినేష్‌కుమార్, ఐటీడీఏ, అటవీ, వివిధ శాఖల అధికారులు

దేవాలయాలకు త్వరలో ధర్మకర్తలు

- దేవదాయ శాఖలో మూడు స్థాయిల్లో కమిటీల నియామకం
- వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక
- జిల్లా ఇన్‌చార్జి మంత్రి అచ్చెన్నాయుడు



మంత్రి అచ్చెన్నకు స్వామివారి చిత్రపటం అందిస్తున్న ఎమ్మెల్యే బండారు

ఆత్రేయపురం, మే 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని దేవాలయాలకు త్వరలో ధర్మకర్తల నియామకం చేపట్టేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతున్నట్టు జిల్లా ఇన్‌చార్జి మంత్రి కింజారపు అచ్చెన్నాయుడు తెలిపారు. గురువారం కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. తొలుతగా అర్చక బృందం ఆలయంలో ఘనస్వాగతం పలికారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని వేదపండితుల ఆశీర్వచనం అందుకున్నారు. ఆలయ ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధరరావు మంత్రిని సత్కరించారు. ఎమ్మెల్యే బండారు సత్యానందరావు మంత్రికి స్వామివారి చిత్రపటం అందజేశారు. అనంతరం రూ.30 లక్షలతో నిర్మిస్తున్న రథశాలకు శంకుస్థాపన నిర్వహించారు. ఈ సందర్భంగా అచ్చెన్నాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలోని దేవదాయ శాఖలో మూడు స్థాయిల్లో కమిటీల నియామకం మరో పదిరోజుల్లో జరుగుతాయన్నారు. తొలివిడతగా ఏసీ స్థాయి, గ్రేడ్-1 స్థాయి కమిటీల నియామకం జరుగుతుందని, తద్వారా మిగిలిన కమిటీలు త్వరగా నియామకం చేస్తామన్నారు. వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు భక్తజనంతో విరజిల్లుతున్న వాడపల్లి క్షేత్రంపై క్యాబినెట్‌లో చర్చించారన్నారు. ఎంతో ప్రాచుర్యం పొందిన ఈ ఆలయ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. త్వరలోనే దేవదాయ కమిషనర్‌తో సమావేశం ఏర్పాటు చేసి మాస్టర్ ప్లాన్ ప్రకారం అభివృద్ధికి కృషిచేస్తామన్నారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో పి.శ్రీకర్, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు ముదునూరి వెంకట్రాజు, కరుటూరి నరసింహరావు, ముళ్ళపూడి భాస్కరరావు, కాయల జగన్నాథం, కూసంపూడి రామకృష్ణంరాజు, జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి ముత్యాల బాబ్జి, మద్దూరి సుబ్బారావు, పి.పుల్లంరాజు వర్మ, జుజ్జవరపు హరిబాబు, మద్దింశెట్టి సత్యనారాయణ, సీఐ విద్యాసాగర్, ఎస్ఐ రాము, తహశీల్దారు రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మానవత్వం చాటిన ఐటీఐ విద్యార్థి

- సత్కరించిన కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్



ఐటీఐ విద్యార్థి, డీసీపీయూ సిబ్బందిని అభినందిస్తున్న కలెక్టర్

కలెక్టరేట్ (కాకినాడ), మే 22(ఆంధ్రజ్యోతి): కాకినాడ ఆర్టీసీ బస్ డిపో సమీపంలో గత మంగళవారం ఏ దిక్కు లేకుండా ముగ్గురు చిన్నారులతో కలిసి వర్షంలో ఆకలితో ఉన్న రామలక్ష్మిని చూసి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కె.గంగవరం మండలం కుందూరుకు చెందిన ఐటీఐ విద్యార్థి వనుము పరమేశ్వర్ చలించిపోయాడు. ఈ విషయమై జిల్లా బాలల పరిరక్షణ విభాగానికి(డీసీపీయూ) సమాచారం ఇవ్వడంతో ఆ మహిళతో పాటు ముగ్గురు చిన్నారులను జీజీహెచ్ వద్ద ఉన్న వన్‌స్టాప్‌కు తీసుకెళ్లి సపర్యలు చేసి చికిత్స అందించారు. బాలల సంక్షేమ సమితి ఆదేశాల మేరకు సఖి వన్ స్టాప్ సెంటర్‌కు తరలించి సంరక్షణ కల్పించారు. విషయం తెలుసుకున్న ఐటీఐ విద్యార్థి పరమేశ్వర్, ప్రొటెక్షన్ అధికారి విజయలను కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ గురువారం సత్కరించారు. ఆపదలో ఉన్న మహిళ, చిన్నారుల దుస్థితిని చూసి వెంటనే స్పందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సీపీవో త్రినాథ్, డీసీపీయూ కౌన్సిలర్ దుర్గారాణి, సోషల్ వర్కర్ చినబాబు, దుర్గాభవాని తదితరులు పాల్గొన్నారు.

యువతకు స్కిల్ హబ్‌లో

ఉద్యోగ, ఉపాధి శిక్షణ

రాజమహేంద్రవరం కల్చరల్ మే 22(ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా కలెక్టరేట్ భవన ప్రాంగణంలోని స్కిల్ హబ్‌లో ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ ద్వారా 18 నుంచి 45 ఏళ్ల వయసున్న వారికి అసిస్టెంట్ ఎలక్ట్రిషియన్ వృత్తి శిక్షణ ద్వారా ఉపాధి అవకాశాలను కల్పించేందుకు తరగతులు త్వరలో ప్రారంభమౌతున్నాయని నాక్ అసిస్టెంట్ డైరెక్టర్ జున్నూరు రాజు, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అర్బన్ స్కిల్ హబ్ కోఆర్డినేటర్ ఎస్.రాజా కాలేబ్ ఓ ప్రకటనలో తెలిపారు. రెండు నెలలపాటు జరిగే ఈ కోర్సులో ప్రవేశానికి పదో తరగతి, ఆపై విద్యార్హతలు ఉన్నవారు అర్హులన్నారు. వివరాలకు ఫ్యాకల్టీ మోత కనకదుర్గ మహాలక్ష్మిని, 62811 14627, 95537 94729 నెంబర్లతో సంప్రదించాలని తెలిపారు.

బిడ్డ కోసం తల్లి ఆవేదనే 'జనరల్ బోగీలు'

- ప్రేమానురాగాల విలువను తెలియజేసిన 'కిడ్నాప్'
- రామవరంలో జాతీయ స్థాయి నాటిక పోటీలు



జనరల్ బోగీలు నాటికలో ఓ సన్నివేశం

అనపర్తి, మే 22 (ఆంధ్రజ్యోతి): అనపర్తి మండలం రామవరంలో నల్లమిల్లి మూలారెడ్డి కళా పరిషత్ 36వ జాతీయ స్థాయి నాటిక పోటీల్లో బుధవారం రాత్రి ప్రదర్శించిన సాయి ఆర్ట్స్ కొలకలూరు వారి జనరల్ బోగీలు, ఉషోదయా కళానికేతన్ వారు ప్రదర్శించిన కిడ్నాప్ నాటికలు ఆకట్టుకున్నాయి. జనరల్ బోగీలు నాటికలో.. కొడుకు ప్రయాణిస్తున్న రైలు ప్రమాదానికి గురై అతడి ఆచూకీ లభించదు. బిడ్డ ఆచూకీ కోసం ఓ తల్లి ఐదేళ్ల పాటు పోరాటం సాగించి అనేక అవమానాలు ఎదుర్కోవడంతోపాటు చివరకు చెరశాలకు వెళుతుంది. ఈ నాటికను కొలకలూరుకు చెందిన సాయి ఆర్ట్స్ సం స్థ అద్భుతంగా ప్రదర్శించింది. కొడుకు ఆచూకీ కోసం పోలీసులకు ఆమెకు జరిగిన సంభాషణ ప్రేక్షకులను ఆకట్టుకుంది.

భర్తను కొంగున కట్టుకుని, వృద్ధులైన అత్తమామలను నిత్యం ఏదో సాకుతో బాధ పెడుతుంది కోడలు. చివరకు వారు వేరు కాపురం పెడతారు. వియ్యంకుడు కూడా తన కూతురికి మాయ మాటలు చెబుతూ ఆర్థిక అవసరాలకు వాడుకుంటాడు. ఇదంతా నిశితంగా గమనిస్తున్న మనుమడు తన తల్లికి, తాతకు బుద్ధి రావాలని నాటకమాడి జ్ఞానోదయం కలిగించడమే కిడ్నాప్ సారాంశం. కత్రపాడుకు చెందిన ఉషోదయా కళానికేతన్ సంస్థ ప్రదర్శించిన ఈ నాటిక ప్రేక్షకులను ఆకట్టుకుంది.

ఇంజనీరింగ్ పరీక్షకు 115 మంది గైర్హాజరు

జేఎన్టీయూకే, మే 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా కాకినాడ జేఎన్టీయూ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఏపీఈఏపీసెట్-2025 ఇంజనీరింగ్ ఆన్‌లైన్ ప్రవేశ పరీక్షలు గురువారం కాకినాడ, తూర్పు గోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లో ప్రశాంతంగా జరిగినట్టు కన్వీనర్ వీవీ సుబ్బారావు తెలిపారు.

కాకినాడ జిల్లాలోని 5 కేంద్రాల్లో ఉదయం పరీక్షకు 901 మంది విద్యార్థులకు 871 మంది హాజరు కాగా 30 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం 898 మంది విద్యార్థులకు 865 మంది హాజరు కాగా 33 మంది గైర్హాజరయ్యారు. మొత్తం రెండు సెషన్లకు కలిపి 96.50 శాతం విద్యార్థులు పరీక్ష రాశారు.

తూర్పు గోదావరి జిల్లాలోని రెండు కేంద్రాల్లో రెండు సెషన్లకు కలిపి మొత్తం 998 మంది విద్యార్థులకు 970 మంది హాజరై 28 మంది గైర్హాజరు కాగా 97.19 శాతం హాజరు నమోదైంది.

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని రెండు కేంద్రాల్లో రెండు సెషన్లలో 807 మంది విద్యార్థులకు 783 మంది హాజరు కాగా 24 మంది గైర్హాజరయ్యారు. 97.03 శాతం హాజరు నమోదైంది. ఇంజనీరింగ్ విభాగం పరీక్షలు ఈ నెల 27వ తేదీ వరకు కొనసాగుతాయని కన్వీనర్ సుబ్బారావు చెప్పారు.

సరస్వతి పుష్కరాలకు రెండు సూపర్ లగ్జరీ బస్సులు

- డిపో మేనేజర్ షేక్ షబ్నం



రాజమహేంద్రవరం అర్బన్, మే 22 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం సరస్వతి పుష్కరాలకు ఈనెల 22వ తేదీ శుక్రవారం సాయంత్రం రాజమహేంద్రవరం ఆర్టీసీ డిపో నుంచి రెండు సూపర్‌లగ్జరీ బస్సులు బయలుదేరి వెడుతున్నాయని డిపో మేనేజర్ షేక్ షబ్నం తెలిపారు. ఈ యాత్రలో కాళేశ్వరం, ధర్మవరం, కొండగట్టు, వేములవాడ, వరంగల్, రామప్పక్షేత్రాలను దర్శించుకుని తిరిగి 25వ తేదీ రాజమహేంద్రవరం చేరుకుంటాయని ఆమె పేర్కొన్నారు.

కొండ దిగి వెళ్లకపోతే

క్రిమినల్ కేసులు పెడతాం!

- అన్నవరం దేవస్థానంలో సేవకు వచ్చిన మంచిర్యాల భక్తులతో ఏఈవో దురుసు ప్రవర్తన
- 'ఏబీఎన్' కథనంతో సీఎంవో, ఇంటెలిజెన్స్ ఆరా
- స్టేట్‌మెంట్ రికార్డు, వివరాలు సేకరించిన ఈవో



కాకినాడ జిల్లా అన్నవరంలో ఈవోకు గోడు వెళ్లబోసుకుంటున్న మహిళలు

అన్నవరం, మే 22 (ఆంధ్రజ్యోతి): వారంతా రాష్ట్రం దాటి అన్నవరం సత్యదేవుడి సన్నిధిలో సేవ చేసేందుకు వచ్చారు. మధ్యవర్తి ద్వారా తునికి చెందిన శ్రీవారి సేవా సంఘం తరఫున దేవస్థానంలో రెండ్రోజులు సేవ నిర్వహించారు. ఈ సమయంలో కొందరు మహిళల మధ్య వాగ్వాదం జరిగింది. ఈ విషయం అన్నవరం దేవస్థానం ఏఈవో కొండలరావు దృష్టికి వెళ్లగా, ఆయన దురుసుగా మాట్లాడి కొండ దిగి వెళ్లకపోతే క్రిమినల్ కేసులు పెడతామంటూ బెదిరించారని మహిళలు ఆరోపించారు. దీనిపై 'ఏబీఎన్'లో కథనం ప్రసారం కావడంతో పంచాయితీ.. ఇంటెలిజెన్స్, సీఎం కార్యాలయానికి చేరుకుంది. వివరాలు.. తెలంగాణ రాష్ట్రం మంచిర్యాల నుంచి 17 మంది మహిళలు, మరొక వ్యక్తి ఈ నెల 19న ఒక మధ్యవర్తి(మహిళ) ద్వారా కాకినాడ జిల్లా తునికి చెందిన శ్రీవారి సేవా సంఘం తరఫున అన్నవరం దేవస్థానంలో ఈ నెల 20, 21 తేదీల్లో రెండ్రోజులపాటు సేవ చేశారు. ఈ సమయంలో తుని శ్రీవారి సేవా సంఘానికి చెందిన ఇద్దరు మహిళలకు, మంచిర్యాల నుంచి వచ్చిన మహిళలకు చిన్నపాటి వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో రైలు ప్రయాణానికి రాను పోను ఖర్చులతోపాటు ఇతర ఖర్చుల కింద వేలల్లో చెల్లించామని మంచిర్యాల మహిళలు చెప్పడంతో ఈ విషయం బుధవారం సాయంత్రం దేవస్థానం ఏఈవో కొండలరావు దృష్టికి వెళ్లింది. ఆయన వెంటనే మంచిర్యాలకు చెందిన మహిళలపై మండిపడ్డారు. ఇలాంటి వ్యవహారాలు ఇక్కడ కుదరవని, తక్షణం కొండ దిగి వెళ్లిపోవాలని, లేకుంటే క్రిమినల్ కేసులు పెడతామంటూ బెదిరించడంతో వారు వెంటనే కొండ దిగి దేవస్థానానికి చెందిన సత్రంలో గదులు అద్దెకు తీసుకున్నారు. ఈ వ్యవహారంపై 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రసారమైంది. దీంతో సీఎంవో, ఇంటెలిజెన్స్ అధికారులు రంగంలోకి దిగి దేవస్థానం ఈవోను వివరణ కోరారు. దీంతో ఈవో సుబ్బారావు ముందుగా మంచిర్యాల నుంచి వచ్చిన మహిళల వద్దకు ఆలయ సహాయ కమిషనర్, సీహెచ్ రామ్మోహనరావు, సూపరెంటెండెంట్ రమణను పంపించి వారి నుంచి స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. అనంతరం ఈవో కార్యాలయం వద్దకు తీసుకొచ్చి దేవస్థానం డీసీ, ఏఈవో సమక్షంలో వారి నుంచి వివరాలు సేకరించారు. సేవ చేసేందుకు వచ్చిన తమను అవమానకరంగా చూశారని, తమకు తిరుగు ప్రయాణం టికెట్లు కొంతమందికి 25వ తేదీ, మరికొంతమందికి 27వ తేదీన ఉన్నాయని తెలిపారు. అప్పటివరకు తమను సేవకులుగా కాకుండా భక్తులుగా అయినా ఉంచాలని కోరినా తుని శ్రీవారి సేవా సంఘానికి చెందిన రమ, విజయ అనుచితంగా ప్రవర్తించారని, వారికి ఏఈవో కొండలరావు వత్తాసు పలకడమే కాకుండా, వెంటనే కొండదిగి వెళ్లకపోతే మీకు ఎక్కడా సేవ దొరక్కుండా చేస్తామని బెదిరించారని ఈవోకు వివరించారు. దీంతో వారిద్దరిపై కేసులు నమోదు చేస్తామని, దేవస్థానం డార్మెటరీలో బస, భోజన ఏర్పాటు కల్పిస్తామని ఈవో హామీ ఇవ్వడంతో శాంతించారు.

రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో
విజేతలుగా ఉమ్మడి జిల్లా జట్లు

పిఠాపురం, మే 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా బాల, బాలికల జట్లు విజేతలుగా నిలిచాయి. చిత్తూరులో జరిగిన ఆంధ్ర రాష్ట్ర 10వ రాష్ట్రస్థాయి జూనియర్ బాలబాలికల చాంపియన్‌షిప్ పోటీల్లో ఉమ్మడి జిల్లా జట్లు పాల్గొన్నాయి. వరుసగా ఐదోసారి బాలబాలికల విభాగాల్లో విజేతలుగా నిలిచి ట్రోఫీని కైవసం చేసుకున్నారు. విజేతలకు ఏపీ స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ రవినాయుడు, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, బాస్కెట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చెంగల్రాయుడు, టెక్నికల్ కమిటీ ఛైర్మన్ సురేష్‌బాబు షీల్డులు అందజేశారు. విజేతలను జనసేన పిఠాపురం ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, మురాలశెట్టి సునీల్‌కుమార్, పిఠాపురం బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ మొగలి కాశీవిశ్వనాథ్, ఉమ్మడి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గన్నమనేని చక్రవర్తి, బొజ్జా మాణిక్యాలరావు, కె.సుందరకుమార్ అభినందించారు.




చిత్తూరులో జరిగిన రాష్ట్రస్థాయి జూనియర్ బాలబాలికల బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో విజేతలుగా నిలిచిన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బాల, బాలికల జట్లు

సత్యదేవుడికి ప్రముఖుల ప్రత్యేక పూజలు

అన్నవరం, మే 22 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో గురువారం రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర, సినీనటుడు సాయి కుమార్ కుటుంబసభ్యులతో వేర్వేరుగా స్వామిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి ఆలయ ఈవో వీర్ల సుబ్బారావు ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనాలు అందజేశారు.


మంత్రి కొల్లు రవీంద్రకు స్వామి వారి ప్రసాదం, మెమెంటో అందజేస్తున్న ఈవో


సత్యదేవుడి దర్శనానంతరం సినీనటుడు సాయికుమార్



అన్నవరం అందాల హరివిల్లు మయం

కాకినాడ జిల్లా అన్నవరం సత్యదేవుడి తూర్పురాజగోపురం వద్ద నల్లని మబ్బుల నడుమ అందాల హరివిల్లు ఆవిష్కృతమై భక్తులను కనువిందు చేసింది. ఈ చిత్రాన్ని ఆంధ్రజ్యోతి కెమెరా క్లిక్ మనిపించింది

అన్నవరం (ఆంధ్రజ్యోతి)

గల్లంతైన మత్స్యకారుడి మృతదేహం లభ్యం

కొత్తపల్లి, మే 22 (ఆంధ్రజ్యోతి): వేటకు వెళ్లి గల్లంతైన కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం ఉప్పాడ నాయకర్ కాలనీకి చెందిన మేరుగు శ్యామ్ (19) మృతదేహం లభ్యమైంది. సోమవారం శ్యామ్, మరో ఇద్దరు సముద్రంలోకి తెప్పపై వేటకు వెళ్లగా కెరటాల ఉధృతికి శ్యామ్ గల్లంతయ్యాడు. మిగతా ఇద్దరు మత్స్యకారులు సురక్షితంగా ఒడ్డుకు చేరుకున్నారు. తెప్ప తిరగబడిన చోటే గురువారం శ్యామ్ మృతదేహం లభ్యమైంది. మృతుడి తండ్రి ఫిర్యాదుతో కాకినాడ పోర్టు పోలీసులు కేసు నమోదు చేశారు.

పాడుబడిన బావిలో మృతదేహం

గోకవరం, మే 22 (ఆంధ్రజ్యోతి): కుళ్లిన స్థితిలో ఓ వ్యక్తి మృతదేహం పోలీసులకు లభ్యమైంది. తూర్పుగోదావరి జిల్లా గోకవరం మండలం తంటికొండ గ్రామంలో కోనేరు మధ్యలోని పాడుబడిన బావిలో వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. వారు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బావిలో నుంచి బయటకు తీశారు. సుమారు 15 నుంచి 20రోజుల క్రితమే మృతి చెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. మృతిచెందిన వ్యక్తి వయస్సు 45 నుంచి 50 ఏళ్లలోపు ఉండవచ్చన్నారు. స్థానికంగా లేక చుట్టుపక్కల ప్రాంతంలో ఆచూకీ లేకుండా ఉన్న వ్యక్తుల వివరాలను సేకరిస్తున్నారు.

పాముకాటుకు మహిళ మృతి

అమలాపురం, మే 22 (ఆంధ్రజ్యోతి): పాముకాటుకు ఓ మహిళ మృతి చెందింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం గోసంగివారిపేటలో గురువారం ఉదయం కొబ్బరితోటలో బహిర్భూమికి వెళ్లిన జల్లి రామలక్ష్మిని పాము కాటు వేయడంతో ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందినట్టు అల్లవరం ఎస్‌ఐ టి.తిరుమలరావు తెలిపారు.

బావమరిదిని నరికిన వ్యక్తికి నాలుగేళ్ల జైలు

దేవరపల్లి, మే 22 (ఆంధ్రజ్యోతి): బావమరిదిని నరికిన కేసులో వ్యక్తికి జైలు శిక్ష పడింది. తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని రంగరాయ కాలనీ బందపురం గ్రామానికి చెందిన షేక్ సయ్యద్ బాజీ తన భార్య కాపురానికి రావడంలేదని కోపంతో దానికి కారణమైన తన బావమరిది షేక్ కరీమ్‌ని 2017లో కత్తితో నరికాడు. దీనిపై ఫిర్యాదు మేరకు దేవరపల్లి పోలీస్‌స్టేషన్ నందు కేసు నమోదు చేసి దర్యాప్తు అనంతరం కొవ్వూరు ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్ కోర్టు నందు చార్జ్‌షీట్ ఫైల్ చేయగా సాక్షుల విచారణ అనంతరం కేసు రుజువుకావడంతో నిందితుడికి గురువారం ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి జీవీఎల్ సరస్వతి నాలుగేళ్ల జైలు శిక్ష, రూ.1500 జరిమానా విధించారు. ఈ కేసులో ప్రాసిక్యూషన్ తరపున ఏపీపీ కాకులపాటి వెంకట్రామణ వాదించగా ప్రాసిక్యూషన్‌కు దేవరపల్లి ఎస్‌ఐ సుబ్రహ్మణ్యం, కోర్టు కానిస్టేబుళ్లు సహకరించారు.

కాపవరం సర్పంచ్‌పై మూడు కేసులు

బిక్కవోలు, మే22(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు మండలం కాపవరం గ్రామ పంచాయతీ కార్యదర్శి కె.విజయలక్ష్మిని వేధించి ఆత్మహత్య చేసుకునేలా ప్రేరేపించిన వైసీపీ సర్పంచ్ సత్యంశెట్టి వెంకటరమణపై మూడు కేసులు నమోదు చేసినట్టు ఎస్‌ఐ వి.రవిచంద్రకుమార్ తెలిపారు. ఈ కేసును రాజమహేంద్రవరం ఈస్ట్‌జోన్ డీఎస్పీ బి.విద్య విచారణ చేపట్టిన విషయం విదితమే. పంచాయతీ కార్యదర్శి పట్ల అసభ్యకరంగా మాట్లాడంపై ఎస్సీ, ఎస్టీ ఎట్రాసిటీ కేసు.. కార్యదర్శి విధులకు ఆటకం కలిగించడంపై సెక్షన్ 353.. కార్యదర్శిని వేధించినందుకు సెక్షన్ 506 కేసులు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు.

దైవ దర్శనానికి వెళ్తుండగా ప్రమాదం

పది మందికి గాయాలు

- ఆగి ఉన్న లారీని ఢీకొన్న వ్యాన్
- రాజానగరం వద్ద ఘటన
- క్షతగాత్రుల స్వగ్రామం ఏలూరు జిల్లా చెక్కపల్లి

రాజానగరం, మే 22 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరం దైవదర్శనానికి వెళ్తుండగా మార్గమధ్యలో హైవేపై ఆగి ఉన్న లారీని టాటా మ్యాజిక్ వ్యాన్ ఢీకొన్న ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన పది మంది గాయపడారు. బుధవారం అర్ధరాత్రి దాటాక ఒంటిగంట సమయంలో జరిగిన ఈ ప్రమాదానికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. ఏలూరు జిల్లా ముసునూరు మండలం చెక్కపల్లి గ్రామానికి చెందిన నాగుల వెంకటేశ్వరరావు, నాగుల రాజ్యలక్ష్మి, బి.రఘుబాబు, బి.లక్ష్మీదుర్గ, తాళం రాధ, బి.దేవిక, బి.లోకేశ్వరరావు, బి.దేవేంద్ర, ఎస్.పావని ఒకే కుటుంబానికి చెందిన బంధువులు. వారంతా టాటా మ్యాజిక్ వ్యాన్‌లో కాకినాడ జిల్లా అన్నవరం సత్యదేవుని దర్శనానికి బయలుదేరారు. మార్గమధ్యలో రాజానగరం సమీపానికి వచ్చేసరికి హైవేపై ఆగి ఉన్న లారీని ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. వ్యాన్‌లో ప్రయాణిస్తున్నవారంతా గాయపడ్డారు. డ్రైవర్ చింతల చెరువు మధుకు తీవ్ర గాయాలయ్యాయి.




సంఘటనా స్థలంలో క్షతగాత్రులను ఆస్పత్రికి తరలిస్తున్న 108 సిబ్బంది

క్షతగాత్రులను చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్ వాహనంలో రాజ మహేంద్రవరంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం ఏలూరు ఆశ్రం ఆస్పత్రికి తరలించినట్టు రాజానగరం పోలీసులు తెలిపారు. ఎవరికీ ప్రాణాపాయం లేదని వైద్యులు నిర్ధారించినట్టు ఎస్‌ఐ నాగార్జున చెప్పారు. వ్యాన్ డ్రైవర్ రెప్పపాటు కారణంగా ఈ ప్రమాదం జరిగి ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు.

పిఠాపురంలో
కారు బీభత్సం

- అతివేగంగా వచ్చి మోటార్‌సైకిళ్లను ఢీకొనడంతో ధ్వంసం
- జాతీయ క్రీడాకారుడు సహా ముగ్గురికి తీవ్ర గాయాలు

పిఠాపురం, మే 22 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం బైపాస్‌లో 216వ హైవేపై పాదగయ సెంటర్ వద్ద కారు బీభత్సం సృష్టించింది. మోటార్‌సైకిళ్లపైకి దూసుకెళ్లడంతో ధ్వంసమై ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత జరిగిన ఈ సంఘటన వాహనదారులను భీతావహులను చేసింది. పిఠాపురం ఇందిరానగర్‌కు చెందిన పోల్‌వాల్ట్ జాతీయ క్రీడాకారుడు పి.కృష్ణ, ఏడిద వెంకటేష్‌లు చిత్రాడలో జరిగిన బి.ప్రత్తిపాడుకు చెందిన కె.మహేంద్ర పెళ్లికి వెళ్లి సామర్లకోట రోడ్డు నుంచి మోటార్‌సైకిళ్లపై తిరిగి వస్తున్నారు. విశాఖపట్టణం నుంచి కాకినాడ వస్తున్న కారు అతివేగంగా రావడంతో పాటు అదుపుతప్పి వారిని ఢీకొని పాదగయ వద్ద పార్కింగ్‌లో ఉన్న మోటార్‌సైకిళ్లపైకి దూసుకెళ్లింది. ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. వారిని ప్రభుత్వ,ప్రవేటు ఆసుపత్రులకు తరలించారు. మహేంద్ర పరిస్థితి విషమంగా ఉంది. పార్కింగ్‌లో ఉన్న 5 మోటారు సైకిళ్లు దెబ్బతిన్నాయి. పిఠాపురం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


బీభత్సం సృష్టించిన కారు


ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

జీవ వైవిధ్య సంరక్షణతోనే సుస్థిరాభివృద్ధి

రాజమహేంద్రవరం సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ రాహుల్
జైలులో జీవ వైవిధ్య దినోత్సవం


జైలులో మొక్కలు నాటుతున్న రాహుల్

రాజమహేంద్రవరం, మే 22 (ఆంధ్రజ్యోతి): జీవ వైవిధ్య సంరక్షణతోనే సుస్థిర అభివృద్ధి సాధ్యమని తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ ఎస్.రాహుల్ పేర్కొన్నారు. గురువారం అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవం సందర్భంగా సెంట్రల్ జైలులో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాహుల్ మాట్లాడుతూ గతేడాది సెంట్రల్ జైలుకు అత్యంత ప్రతిష్టాత్మకమైన ఆంధ్రప్రదేశ్ జీవ వైవిధ్య పురస్కారం లభించిందని గుర్తుచేశారు. చారిత్రాత్మకమైన రాజమండ్రి సెంట్రల్ జైలులో జీవ వైవిధ్య సంరక్షణకు ఖైదీలు ఎంతో కృషి చేస్తున్నారన్నారు. జైలులో వివిధ చెట్ల నుంచి రాలుతున్న ఆకులు, పువ్వులను నిత్యం సేకరించి సేంద్రీయ ఎరువులను తయారు చేస్తున్నామన్నారు. వర్మీ యార్డులో వర్మీ కంపోస్టు కూడా తయారవుతోందన్నారు. వాడేసి న ప్లాస్టిక్ బాటిళ్లను వివిధ రకాలుగా ఉపయోగిస్తున్నామన్నారు. 200 ఏళ్లకు పైబడిన చెట్లు కేంద్ర కారాగార ఆవరణలో ఉన్నాయని వాటిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని సంరక్షిస్తున్నామన్నారు. పచ్చదనం పరుచుకోవడంతో ఉడతలు, గోరింకలు, రామ చిలుకలు, కాకులు, కోయిలలు వంటి జీవాలు ఇక్కడ స్వేచ్ఛగా సంచరిస్తున్నాయని చెప్పారు. జైలు ఆవరణలో ఖైదీలతో మొక్కలు నాటించారు. పక్షుల ఆహారం కోసం వరి కంకుల కుచ్చులను, నీటిని ఏర్పాటు చేయించారు. పర్యావరణ పరిరక్షణ, పరిశుభ్రతకు జైలులో ప్రతి రోజూ ప్రణాళిక ప్రకారం కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని డిప్యూటీ సూపరింటెండెంట్ ఎం.రాజ్‌కుమార్ వెల్లడించారు. డీఎస్ రత్నరాజు, పర్యావరణ మిత్ర శ్రీనివాసరావు పాల్గొన్నారు.


వరి కంకుల కుచ్చులను కడుతున్న అధికారులు

వ్యాన్ ఢీకొని బాలుడి మృతి

రౌతులపూడి, మే 22 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా రౌతులపూడి గ్రామానికి చెందిన మోర్తా రమేష్‌బాబు (15) వ్యాన్ ఢీకొని మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గురువారం మెరక చామవరం గ్రామం నుంచి బైక్‌పై గెడ్డం ప్రసాద్, మోర్తా రమేష్‌బాబు వస్తుండగా రౌతులపూడి శివారు మరిడమ్మతల్లి ఆలయం దగ్గరకు వచ్చేసరికి రౌతులపూడి నుంచి శంఖవరం వెళ్తున్న బోలేరో వ్యాన్ బైక్‌ను ఢీకొనడంతో వెనక ఉన్న రమేష్‌బాబు కిందపడి తలకు బలమైన గాయమైంది. రౌతులపూడి ఆసుపత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మోర్తా నాగేశ్వరరావు, సత్యవతి దంపతులకు ఇద్దరు కుమారులు కాగా రమేష్ బాబు చిన్న కుమారుడు. పోలీసులు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం తుని ఏరియా ఆసుపత్రికి తరలించారు.


మరణించిన రమేష్‌బాబు(ఫైల్)

పరీక్ష రాసి ఇంటికెళ్తుండగా..

ఆగి ఉన్న వ్యాన్‌ను ఢీకొని తల్లీకూతుళ్లకు తీవ్రగాయాలు

పెద్దాపురం, మే 22 (ఆంధ్రజ్యోతి): ఏపీఈఏపీ సెట్ ఎగ్జామ్ రాసి తిరిగి ఇంటికెళ్లే క్రమంలో ఆగి ఉన్న ఐషర్ వ్యాన్‌ను బలంగా ఢీకొని తల్లీకూతుళ్లు తీవ్రంగా గాయపడ్డారు. కాకినాడ జిల్లా పెద్దాపురం ఏడీబీ రోడ్డులో గురువారం జరిగిన ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... తాళ్లరేవుకు చెందిన సాహితి ఈఏపీ సెట్ పరీక్ష రాసేందుకు సూరంపాలెంలోని ఆదిత్య కళాశాలకు తల్లితో కలిసి స్కూటీపై వచ్చింది. పరీక్ష రాసిన తర్వాత ఇంటికి తిరిగి వెళ్తుండగా మార్గమధ్యంలో రోడ్డు పక్కన ఆగి ఉన్న ఐషర్ వ్యాన్‌ను అదుపుతప్పి వెనుక నుంచి బలంగా ఢీకొన్నారు. తల్లీకూతుళ్లు తీవ్రగాయాలు అయ్యాయి. హైవే పెట్రోలింగ్ పోలీసులు పెద్దాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అతివేగమే ప్రమాదానికి కారణమని తెలుస్తోంది. ఎస్‌ఐ మౌనిక కేసు దర్యాప్తు చేస్తున్నారు.


ప్రమాదంలో గాయపడిన తల్లి

రోడ్డు ప్రమాదంలో వీఆర్వో భర్త మృతి

వై.రామవరం, మే 22 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా వై.రామవరం మండలం పనసల పాలెం శివారు కల్వర్టు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో వై.రామవరంలో పని చేస్తున్న వీఆర్వో మిడియం కాంతమ్మ భర్త చోడి సీతారామయ్య (35) మరణించాడు. బుధవారం రాత్రి చవిటి దిబ్బలు వైపు నుంచి వై.రామవరం వస్తుండగా ఈ ప్రమాదం జరిగినట్టు చెప్తున్నారు. వాహనం అదుపు తప్పిందా లేక వేరే వాహనం ఢీకొందా అనే దానిపై స్పష్టత లేదు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించామని, మృతుడి భార్య ఇచ్చిన ఫి ర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు.


మృతిచెందిన సీతారామయ్య

కాలువలోకి దూసుకెళ్లిన లారీ

ప్రత్తిపాడు, మే 22 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు జాతీయ రహదారిపై కాలువలోకి లారీ దూసుకెళ్లింది. గురువారం తుని నుంచి రాజమహేంద్రవరం వైపు వెళ్తున్న లారీ ప్రత్తిపాడు సుద్దగడ్డ వాగు వద్ద అయ్యప్పస్వామి మైదానం ఎదురుగా ఉన్న కాలువలోకి వేగంగా దూసుకెళ్లింది. అయితే అక్కడే 11కేవీ విద్యుత్ లైన్ల విద్యుత్ స్తంభం ఉంది. లారీ విద్యుత్ స్తంభాన్ని ఢీకొని ఉంటే ప్రమాదం జరిగేది. ఘటనలో డ్రైవర్, క్లీనర్ సురక్షితంగా బయటపడ్డారు.



ఉప్పాడలో టూరిజం స్పాట్ ఏర్పాటు

ఆంధ్రప్రదేశ్ టూరిజం చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ పద్మారాణి

కొత్తపల్లి, మే 22 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం ఉప్పాడలో టూరిజం స్పాట్ ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ఆంధ్రప్రదేశ్ టూరిజం చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్(ఏపీటీసీఎంవో) పద్మారాణి తెలిపారు. గురువారం ఆమె ఉప్పాడ తీరప్రాంతం, వీవర్స్ కాలనీలో పర్యటించారు. చేనేత కార్మికులు మగ్గాలపై తయారుచేస్తున్న చీరలు, వివిధ రకాల ఆల్బమ్‌లను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ఉప్పాడ తీరప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు అన్నిరకాల సౌకర్యాలు ఉన్నాయన్నారు. విశాలమైన తీరప్రాంతంలో అనేకమంది మత్స్యకారులు బోట్లపై జీవనోపాధి పొందడం గుర్తించామన్నారు. ఉప్పాడలో చేనేత జాంధానీ చీరల ఉత్పత్తి పెంపు, కార్మికుల జీవనోపాధి పెంపొందించేందుకు తీసుకోవాల్సిన అంశాలపై వివరాలను సేకరించి తద్వారా నివేదికను పంచాయతీరాజ్ శాఖకు సమర్పిస్తామని చెప్పారు. పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలనే ప్రభుత్వ లక్ష్యంతో ఉప్పాడ గ్రామాన్ని సందర్శించినట్టు చెప్పారు. టూరిజం కన్సల్టెంట్ నిష్టాగోయల్, క్రియేటివ్ డిజైనర్ మణికంఠ, కొత్తపల్లి ఎంపీడీవో పి.రవికుమార్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, చేనేత కార్మికులు ఉన్నారు.


ఉప్పాడ వీవర్స్ కాలనీలో చేనేత కార్మికులతో మాట్లాడుతున్న పద్మారాణి

మాధవరాయుడుపాలెం
సర్పంచ్‌కు జీవవైవిధ్య పురస్కారం

కడియం, మే 22(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఇచ్చే అత్యంత ప్రతిష్టాత్మక జీవవైవిధ్య పురస్కారం-2025 తూర్పుగోదావరి జిల్లా మాధవరాయుడుపాలెం సర్పంచ్, టీడీపీ రాష్ట్ర కార్య నిర్వహణ కార్యదర్శి అన్నందేవుల చంటికి దక్కింది. అంతర్జాతీయ జీవవైవిధ్య దినోత్సవాన్ని గురువారం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో రాష్ట్ర బయోడైవర్సిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జీవవైవిధ్యం కోసం కృషి చేసిన విశిష్ట వ్యక్తులను సత్కరించి పురస్కారాలు అందించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ అన్నందేవుల చంటిని దుశ్శాలువాతో ఘనంగా సత్కరించి జీవవైవిధ్య పురస్కారం, జ్ఞాపిక అందజేశారు. ప్రకృతి వ్యవసాయం, పర్యావరణ పరిరక్షణ, సోలార్ యూనిట్ల ద్వారా విద్యుత్ ఉపయోగం, రోడ్డుకిరువైపులా మొక్కలు పెంచి పచ్చదనం పెంపొందించడం తదితర అంశాల్లో 25ఏళ్లుగా చేస్తున్న కృషికి గాను చంటికి ఈ పురస్కారం లభించింది. కార్యక్రమంలో జీవ వైవిధ్య మండలి ఛైర్మన్ నీలాయపాలెం విజయకుమార్, మెంబర్ సెక్రటరీ రామకృష్ణ తదితరులున్నారు.



డిప్యూటీ సీఎం పవన్ చేతులమీదుగా పురస్కారం అందుకుంటున్న అన్నందేవుల చంటి

బాలికతో అసభ్య ప్రవర్తన..
గాజుల వ్యాపారిపై పోక్సో కేసు

సర్పవరం జంక్షన్, మే 22 (ఆంధ్రజ్యోతి): 12ఏళ్ల బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్టు సర్పవరం పోలీస్‌స్టేషన్ మహిళా ఎస్‌ఐ లలితాదేవి తెలిపారు. కాకినాడ రూరల్ రమణయ్యపేట శివారు రాయుడుపాలెంలో గురువారం ఉదయం 10.30 గంటల సమయంలో వీధిలో తోపుడు బండి వద్దకు తల్లితో కలసి 12 ఏళ్ల బాలిక గాజులు, ఇతర సామాన్ల కొనుగోలు చేసేందుకు వచ్చింది. గాజులు చూస్తుండగా బాలికను వదిలి తల్లి ఇంట్లోకి వెళ్లింది. ఈ సమయంలో తోపుడు గాజుల బండి వ్యాపారి కంచెపు సూర్యప్రభాకర్ (50) బాలికతో అసభ్యంగా ప్రవర్తించడంతో ఏడుస్తూ ఇంట్లోకి వెళ్లి జరిగిన సంఘటనపై తల్లికి చెప్పింది. సూర్యప్రభాకర్‌పై చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు సర్పవరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ బి పెద్దిరాజు ఆదేశాల మేరకు నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్టు మహిళా ఎస్‌ఐ లలితాదేవి తెలిపారు.

రాజమహేంద్రవరం

కోకో పెంపకాన్ని ప్రోత్సహించాలి : కలెక్టర్

రాజమహేంద్రవరం అర్బన్, మే 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కోకో తోట పంటల విస్తరణపై ఉద్యానశాఖ అధికారులు దృష్టిసారించాలని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. దీనివల్ల రైతు అదనపు ఆదాయం పొందడానికి అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లో కోకో క్లస్టర్ అభివృద్ధి కార్యక్రమంపై కలెక్టర్ ప్రశాంతి సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా 600 హెక్టార్లలో కోకో సాగు అయ్యేలా చూడాలని, అందుకు అనుగుణంగా లక్ష్యాలను నిర్దేశించుకోవాలని అన్నారు. రైతులను ప్రోత్సహించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అన్నారు. కొబ్బరి, ఆయిల్‌పామ్ పంటల్లో అంతరపంటగా వేసే కోకో తోటలపై రైతులకు అవగాహన కల్పించాలని అన్నారు. అలాగే మట్టి అవసరం లేకుండా వ్యర్థాల నుంచి తయారు చేసిన కంపోస్టుతో మొక్కలను పెంచే ప్రాజెక్టు గురించి కలెక్టర్ చర్చించారు. గృహ వ్యర్థాలు, ఆహార వ్యర్థాలు, మున్సిపల్ వ్యర్థాల సాయంతో తయారు చేసిన కంపోస్టు మొక్కల పెంపకానికి ఎలా ఉపయోగపడుతుందో కేరళకు చెందిన డాక్టర్ మనోజ్ వివరించారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యాన అధికారిణి సుజాత కుమారి, జిల్లా సూక్ష్మసేద్య అధికారి దుర్గేష్, జిల్లా పశు సంవర్థక అధికారి డాక్టర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కాపవరం సర్పంచ్‌పై చర్యలు తీసుకోవాలి


కాపవరంలో విలేకర్లతో మాట్లాడుతున్న దళిత నేతలు

మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి చిన్నారావు

బిక్కవోలు, మే 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాపవరం గ్రామ పంచాయతీ కార్యదర్శి కె.విజయలక్ష్మిని వేధించి, ఆత్మహత్యాయత్నానికి కారణమైన వైసీపీ సర్పంచ్ సత్యంశెట్టి వెంకటరమణపై చర్యలు తీసుకోవాలని మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి చిన్నారావు డిమాండ్ చేశారు. గురువారం కాపవరంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దళిత మహిళా సెక్రటరీని సర్పంచ్ కులం పేరుతో దూషిస్తూ, వేధింపులకు గురి చేయడంతో ఆత్మహత్యకు ప్రయత్నించిందన్నారు. ప్రభుత్వం అతడిపై చర్యలు తీసుకోవాలన్నారు. గతంలో కోడికత్తి శ్రీను, డ్రైవర్ సుబ్రహ్మణ్యం, మాస్కులు అడిగిన డాక్టర్ సుబ్రహ్మణ్యం దళితులనే నెపంతో గత వైసీపీ పాలనలో ఇబ్బందులు పెట్టారని, ఇప్పుడు వైసీపీ సర్పంచ్ వెంటరమణ కూడా సెక్రటరీని ఇబ్బందులకు గురి చేస్తున్నాడన్నారు. అతడిని పార్టీ నుంచి సస్పెండ్ చేసి, సెక్రటరీకి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. మందపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ దళిత మహిళను ఆత్మహత్యకు పురిగొల్పిన సర్పంచ్ వెంకటరమణపై చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో రాష్ట్రంలోని దళిత సంఘాలన్నీ ధర్నా చేపడతాయని హెచ్చరించారు. సమావేశంలో కుందేటి ప్రభుదాసు, చిర్రా వరప్రసాద్, పెడిమళ్ల స్వామి, సోమరాజు, పోసిబాబు తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల రోడ్లకు మహర్దశ


శిలాఫలకం ఆవిష్కరించిన మంత్రి దుర్గేష్

రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్

అనపర్తి మే 22(ఆంధ్రజ్యోతి): కూటమి పాలనలో గ్రామీణ ప్రాంతాల రోడ్లకు మహర్దశ ఏర్పడిందని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. మండలంలోని రామవరంలో బుధవారం రాత్రి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డితో కలిసి రూ.1.50 కోట్లతో అభివృద్ధి చేసిన రామదాసు పుంత రోడ్డును ఆయన ప్రారంభించారు. నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధికి స్థానిక ఎమ్మెల్యే ప్రాధాన్యమిస్తున్నారన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణువర్దన్‌రెడ్డి, కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

నర్సరీ సంఘాన్ని సందర్శించిన పెనలిస్ సంస్థ ఎండీ

కడియం, మే 22(ఆంధ్రజ్యోతి): నర్సరీ అసోసియేషన్‌ను గురువారం కేరళకు చెందిన పెనలిస్ సంస్థ ఎండీ సీఎస్ మనోజ్ బృందం సందర్శించింది. వారిని నర్సరీ సంఘ అధ్యక్షుడు రత్నం అయ్యప్ప స్వాగతించారు. ఇక్కడ రైతులు మట్టికి బదులు కోకో పీట్, రైస్ రస్క్, ఫిట్‌మాస్ వంటి వాటిని ఉపయోగిస్తున్న విషయాలను వివరించారు. మట్టికి బదులుగా నేచురల్ పద్ధతిలో కంపోజిటెడ్ లిగ్నైటెడ్ మిశ్రమాన్ని నర్సరీ రైతులకు అందుబాటులోకి తెచ్చేందుకు ప్రాజెక్టు రిపోర్టు ఇవ్వాలని మనోజ్‌ను అయ్యప్ప కోరారు. ఈ విధానం వస్తే మొక్కకు అవసరమైన సూక్ష్మ పోషకాలు పుష్కలంగా లభిస్తాయని, వర్మీ కంపోస్టు అవసరం ఉండదని, అలానే రైతులకు మట్టి, రవాణా భారం తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో కొండేపూడి నాగు, రత్నం బాబ్జి, పిల్లా శ్రీనువాస్, నాగేంద్ర తదితరులు ఉన్నారు.


పెనలిస్ సంస్థ ఎండీ మనోజ్‌కు మొక్కను అందజేస్తున్న అయ్యప్ప

20 లీటర్ల సారా స్వాధీనం

రంగంపేట, మే, 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఈలకొలను గ్రామంలో గురువారం సారా తయారీ స్థావరాలపై దాడులు నిర్వహించి 20 లీటర్ల సారాని స్వాధీనం పరచుకొని, 400 లీటర్ల బెల్లపుఊటను ధ్వంసం చేసినట్టు ఎక్సైజ్ సీఐ సుధ తెలిపారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన కోట బుజ్జిని అరెస్ట్ చేశామన్నారు. ఈ దాడుల్లో ఎస్ఐ దుర్గాప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రాజానగరం, మే 22 (ఆంధ్రజ్యోతి): వార్షిక మరమ్మతుల్లో భాగంగా 33/11కేవీ కానవరం విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి సరఫరా అయ్యే 11 కేవీ కానవరం ఇండస్ట్రియల్ ఫీడర్‌కు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ట్రాన్స్‌కో ఈఈ జేపీబీ నటరాజన్ గురువారం తెలిపారు. ఈ కారణంగా కానవరం, పరిజల్లిపేట గ్రామాలకు ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని వినియోగదారులు సహకరించాలని రాజానగరం ఏఈ సుధాకర్ కోరారు.

శ్రీ పాశాలమ్మకు వెండి ఆభరణాల బహూకరణ

సీతానగరం, మే 22(ఆంధ్రజ్యోతి): ముగ్గళ్ల గ్రామ దేవత శ్రీపాశాలమ్మ జాతర ఈనెల 25 వరకు గ్రామస్థులు నిర్వహిస్తున్నారు. దీంతో గ్రామానికి చెందిన నాదెళ్ల రమాదేవి, కుమారుడు వెంకటశ్రావణ్ రూ.1.80లక్షల విలువైన వెండి చేయించి కిరీటాన్ని అమ్మవారికి అలంకరించారు. అలాగే తమ్మన వీరవెంకట సత్యనారాయణ కుమారుడు నాగరవికుమార్ కుమార్తె బి.కనకదుర్గ రూ.30 వేలు విలువ చేసే వెండి వడ్డాణం, ముక్కుపుడక, బొట్టులను అమ్మవారికి అలంకరించారు.

ఒకరి అదృశ్యం

రాజమహేంద్రవరం, మే 22(ఆంధ్రజ్యోతి): తిలక్ రోడ్డు ప్రాంతంలో నివాసం ఉంటున్న బి.వివేకానంద(43)కు అనారోగ్యం వల్ల వైద్యం జరుగుతోంది. అతడిని ధూమపానం, మద్యం మానుకోవాలని వైద్యులు సూచించారని, వాటి కోసం ఎవరూ లేని సమయంలో బయటకి వెళ్లి వస్తుంటారని, గురువారం అలా వెళ్లి తిరిగి ఇంటికి రాలేదని భార్య నాగమణి ఫిర్యాదుతో ప్రకాశం నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు.

ప్రొఫెసర్ ప్రభుచంద్‌కు పీహెచ్‌డీ



రాజానగరం, మే 22(ఆంధ్రజ్యోతి): గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయంలోని మైనింగ్ ఇంజనీరింగ్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ ప్రభుచంద్ ధన్బాద్ ఐఐటీలోని ఫ్యూయల్ మినరల్ అండ్ మెటలాజికల్ విభాగాధిపతి ఆచార్య శ్రావణ్‌కుమార్ మార్గదర్శకత్వంలో పీహెచ్‌డీ పూర్తి చేసినట్టు తెలిపారు. ఉక్కు తయారీకి కావాల్సిన ముడి ఇనుము నాణ్యతను మెరుగుపరిచే సాంకేతిక పద్ధతులపై తాను పరిశోధన చేసినట్టు చెప్పారు. ఈ సందర్భంగా ప్రభుచంద్‌ను జీజీయూ చాన్సలర్ సత్యనారాయణరాజు, ప్రోచాన్సలర్ శశికిరణ్ వర్మ, ఉప కులపతి యు.చంద్రశేఖర్, రిజిస్ట్రార్ పీఎంఎంఎస్ శర్మ, డైరెక్టర్ ఎం.శ్రీనివాసరావు తదితరులు అభినందించారు.

పరిశుభ్రతకు నీళ్లు



అడుగు జాగా నుంచి కూడా ఆదాయం రాబడుతున్న రైల్వే.. రాజమండ్రి రైల్వే స్టేషనులోని రెండు అంతస్తులున్న ఓ పెద్ద దుకాణాన్ని అపరిశుభ్రతకు వదిలేసిందనడానికి రుజువులే ఈ ఫొటోలు. ఇక్కడ పరిస్థితి చూస్తే స్వచ్ఛభారత్ తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేస్తుంది. ఒకటో ప్లాట్‌ఫాంపై ఎస్ఎంఆర్ గది పక్కన ఆహారం ఫుడ్ ప్లాజా ఉండేది. ఆరు నెలల క్రితం అది మూత పడింది. పెద్ద హాలు, కిచెన్, మరో గదితో పాటు పైన మరో అంతస్తులో ఉన్న బాత్‌రూంలు, గదులు, ఎలక్ట్రికల్ వైరింగ్ ధ్వంసమవుతోంది. చెత్తాచెదారం పేరుకుపోయింది. కొందరు మందు కొట్టడానికి ఈ ప్రదేశాన్ని ఉపయోగించుకుంటున్నారని తెలుస్తోంది. ముఖ్యంగా ఇక్కడ ఎవరిపైన అయినా ఏదైనా అఘాయిత్యం చేసినా గుట్టు చప్పుడు కాకుండా ఉండే అవకాశం ఉంది. కనీసం భద్రత కరువైంది. ఇంత పెద్ద జాగాను నెలల తరబడి అపరిశుభ్రత, అభద్రతకు వదిలేసే బదులు ఆహార పదార్థాలు అందుబాటులో ఉంచితే ఉపయోగకరంగా ఉంటుందని ప్రయాణికులు అంటున్నారు. ఒకవేళ అది కుదరకపోతే శుభ్రం చేయడంతోపాటు తగు రక్షణ ఏర్పాట్లు చేయాలని సూచిస్తున్నారు.

\- రాజమహేంద్రవరం(ఆంధ్రజ్యోతి)

నమో..వాయుపుత్రాయ

- ఘనంగా హనుమజ్జయంతి
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- తమలపాకులు, సిందూరంతో అర్చనలు
- హనుమాన్ చాలీసా పారాయణం
- పలుచోట్ల అన్న సమారాధనలు


తొర్రేడులో హనుమత్ జయంతి పూజలు

కడియం, మే 22(ఆంధ్రజ్యోతి): హనుమజ్జయంతి వేడుకలు పలుచోట్ల గురువారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కడియం శ్రీఅభయాంజనేయస్వామి ఆలయ 12వ వార్షికోత్సవ జరిగింది. స్వామి వారిని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ దర్శించుకున్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు, కూటమి నాయకులు ఉన్నారు. కాగా హనుమత్ జయంతి మండలంలోని పలు గ్రామాల్లో జరిగింది. ఉదయం నుంచి స్వామి వారికి తమలపాకు, సిందూర పూజలు, అభిషేకాలు జరిగాయి. భక్తులు స్వామి వారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.

రాజమహేంద్రవరం రూరల్: మండలంలోని తొర్రేడు గ్రామంలో భక్తాంజనేయస్వామి ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. ఈ సందర్భంగా గణపతి పూజ, శ్రీసరస్వతి బాల భక్తన సమాజం, గీతా వికాస్ భజన బృందం పూజలు నిర్వహించారు. పంచామృత, ఏకవార అభిషేకాలు, నాగవల్లీ సహిత సిందూర పూజలు, 108 సార్లు హనుమాన్‌చాలీసా పారాయణం, భక్తులు గోత్రనామాలతో పూజలు జరిపారు. ఆలయం వద్ద ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రాజానగరం: మండలంలోని రాజానగరంలో రావులచెరువు గట్టున ఆంజనేయస్వామి ఆలయం వద్ద అన్నసమారాధన నిర్వహించారు. స్థానిక జడ్పీ హైస్కూల్ సెంటర్, సూర్యారావుపేట హైవేపై ఉన్న పంచముఖ ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు జరిపించారు. హనుమాన్ చాలీసా పారాయణం ఆలపించారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి స్వామి వారిని దర్శించుకున్నారు.

బిక్కవోలు: బిక్కవోలులోని పంచాయతీ వీధిలోని ఆంజనేయస్వామి ఆలయంలో ధర్మకర్త ఒబిలినేని వెంకటకృష్ణ ఆధ్వర్యంలో అర్చకులు రుద్రాభిషేకం, సుందరకాండ పారాయణం, సిందూర, నాగవల్లి(తమలపాకులు) అర్చనలు, పూజలు, అభిషేకాలు జరిపారు. ఊలపల్లి రోడ్డులోని ఆంజనేయస్వామిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. ఊలపల్లి, పందలపాక గ్రామాల్లో ఆంజనేయస్వామి ఆలయాల్లో హనుమజ్జయంతి నిర్వహించి భారీ ఎత్తున అన్న సమారాధనలు చేశారు. తొస్సిపూడిలో భక్తాంజనేయస్వామి అన్నదాన సమాజం, గొలుగూరి సూర్యనారాయణరెడ్డి చందన దంపతులు నగర సంకీర్తన చేశారు. జీఎస్ఎన్ రెడ్డి, కర్రి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ధవళేశ్వరం: గ్రామంలోని పలు ఆలయాల్లో ఆంజనేయస్వామికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. జనార్దనస్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న ఆంజనేయ స్వామికి ఉత్సవ కమిటీ చైర్మన్ నాళ్ల రమేష్ ఆధ్వర్యంలోను, బస్టాండ్ వద్ద ఉన్న అభయాంజనేయ స్వామి ఆలయంలో చైర్మన్ బర్రి సుబ్బారావు ఆధ్వర్యంలోను, రథం వీధిలోని కోదండ రామాలయంలో, శివాలయంలోని ఆంజనేయస్వామి ఆలయంలో హనుమన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమంతుడికి తమలపాకులు, సిందూరంతో అర్చన నిర్వహించారు. బస్టాండ్ వద్ద అభయాంజనేయస్వామిని టీడీపీ సీనియర్ నాయకుడు గన్ని కృష్ణ, కడియం ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్, ఆకుల వీర్రాజు, చందన నాగేశ్వరరావు, ఎం.శివ సత్యప్రసాద్, మజ్జి పద్మ తదితరులతో పాటు స్థానిక నాయకులు సందర్శించి పూజలు నిర్వహించారు.మధ్యాహ్నం బస్టాండ్ సెంటర్ వద్ద మహా అన్నదానం నిర్వహించారు.

రంగంపేట: మండలంలోని కోటపాడు గ్రామంలో శ్రీ ప్రసన్న అంజనేయస్వామి దేవస్థానంలో ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, మహాలక్ష్మీ దంపతులు స్వామివారిని దర్శించుకున్నారు. టీడీపీ నాయకుడు కోనే వెంకన్న మొక్కుకున్న 111 కొబ్బరికాయల మొక్కు చెల్లించుకుని, వెండి కిరీటాన్ని స్వామివారికి అలంకరించారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆళ్ల గోవిందు, మండలాధ్యక్షుడు ఎలుగుబంటి సత్తిబాబు, కోనే వెంకన్న, అచంట వెంకటేష్, దేసిన సత్యనారాయణ, నిమ్మన గిరి, దాసరి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అనపర్తి: మండంలోని కుతుకులూరు గ్రామంలో భక్తాంజనేయస్వామికి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, మహాలక్ష్మీ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన అన్నసమారాధన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే దంపతులు ప్రారంభించాయి. అలాగే అనపర్తి, పొలమూరు, రామవరం గ్రామాల్లో ఆంజనేయ స్వామి ఆలయాలను అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.


తొస్సిపూడిలో నగర సంకీర్తన చేస్తున్న భక్తులు

రాజమహేంద్రవరం కల్చరల్: స్థానిక తిలక్‌రోడ్డులోని శ్రీ షిర్డిసాయి రామమందిరం ఆవరణలో ఉన్న పంచముఖి ఆంజనేయస్వామి ఆలయంలో తమలపాకులు, సిందూరంతో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం జరిగిన అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, వీరరాఘవమ్మ, అపర్ణ ప్రా రంభించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, ప్రముఖులు పాల్గొన్నారు. స్థానిక సీటీ ఆర్ఐ రోడ్డులోని భాస్కర్‌నగర్‌లో ఉన్న బాలాం జనేయ స్వామి మందిరం వద్ద హనుమాన్ జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో సీసీసీ చానెల్ ఎండీ పంతం కొండలరావు, సెంట్రల్ జోన్ డీఎస్పీ రమేష్‌బాబు, మందిర కమిటీ అధ్య క్షుడు గుదే రఘునరేష్, సభ్యులు పాల్గొన్నారు. స్థానిక పుష్కర్ ఘాట్ గోసాయి సన్నిధి మఠం లో బొండాడ దుర్గా రాజేంద్రప్రసాద్ సిద్ధాంతి ఆధ్వర్యంలో ఆంజనేయస్వామికి విశేష పూజలు చేశారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్,మాజీ ఎమ్మె ల్యే రౌతు సూర్యప్రకాశరావు, దేవాదాయ శాఖ ఈవో కృష్ణదేవి, ఇన్నమూరి దీపు, వాకచర్ల కృష్ణ, పొలసానపల్లి హనుమంతరావు, ప్రభుత్వ న్యా యవాది ధర్మారావు పాల్గొన్నారు. శివజ్యోతి థియేటర్ సమీపంలోని చైతన్య ఆటోస్టాండ్ వద్ద శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయంలో మరంటంటి కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆర్యాపురం బ్యాంకు చైర్మన్ చల్లా శంకరరావు దంపతులు పూజా కార్యక్రమాల అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో బెజవాడ రంగారావు, తుమ్మిడి అరుణ్‌కుమార్, కొండపల్లి రమణ, నాగేశ్వరరావు పాల్గొన్నారు.


కడియంలో ఆంజనేయస్వామికి పూజలు నిర్వహిస్తున్న మంత్రి దుర్గేష్


అన్నసమారాధనలో పాల్గొన్న ఆదిరెడ్డి అప్పారావు

నేడు ఉచిత వైద్య శిబిరం

రాజమహేంద్రవరం సిటీ, మే 22(ఆంధ్రజ్యోతి): ఈ నెల 23న స్థానిక పాత నటరాజ్ థియేటర్ ప్రాంగణంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు అగ్ని ట్రస్ట్ నిర్వాహకులు తెలిపారు. శిబిరంలో బీపీ, సుగర్, ఈసీజీ, కిడ్నీ, లివర్ పరీక్షలు జరిపి ఉచితంగా మందులు పంపిణీ అందజేయనున్నారని, ఈ శిబిరాన్ని ప్రజలు సద్వినియోగపరచుకోవాలని కోరారు.

టీచర్ల బదిలీలపై సహాయానికి హెల్ప్ డెస్క్

రాజమహేంద్రవరం అర్బన్, మే 22(ఆంధ్రజ్యోతి): టీచర్ల బదిలీలు, పదోన్నతులకు సంబంధించి రాజమహేంద్రవరం యూటీఎఫ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్‌ను సద్వినియోగం చేసుకోవాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎన్.అరుణకుమారి అన్నారు. గురువారం రాజమహేంద్రవరంలోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో హెల్ప్‌డెస్క్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పి.జయకర్, ఏ.షరీఫ్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులకు సంబంధించి ఉపాధ్యాయ సంఘాలు, ప్రభుత్వం మధ్య ఏర్పడిన ప్రతిష్టంభన తొలగి నిర్వహణకు షెడ్యూల్ విడుదల చేయడం ఆనందంగా ఉందన్నారు. ఈ క్రమంలో ఉపాధ్యాయులకు సందేహాలు నివృత్తి చేయడానికి, మార్గనిర్దేశనం చేయడానికి, అప్లికేషన్లు పెట్టుకునే సమయంలో సహాయం అందజేయడానికి రాజమహేంద్రవరంతోపాటు ఉండ్రాజవరం, గోకవరం, నిడదవోలు ప్రాంతాల్లో హెల్ప్‌డెస్క్‌లను ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు ప్రభాకర్ వర్మ, ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత


ఆర్థిక సాయం అందజేస్తున్న ఆటోయూనియన్ నాయకులు

దివాన్‌చెరువు, మే22 (ఆంధ్రజ్యోతి): దివాన్‌చెరువులో ఇటీవల మృతిచెందిన ఆటోడ్రైవర్ దొడ్డి శివప్రసాద్ కుటుంబానికి స్థానిక శ్రీ లక్ష్మీగణపతి ఆటో యూనియన్ కార్మికుల సహకారంతో రూ.70 వేల నగదును గురువారం అతడి కుటుంబ సభ్యులకు యూనియన్ అధ్యక్షుడు దాసరి శ్రీనివాసరావు గురువారం అందజేశారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ ఉపాధ్యక్షుడు చిలకసాని రాంబాబు, కొప్పర్తి సూరిబాబు, మారిశెట్టి శ్రీనివాస్, మెట్టపంట నాగు పాల్గొన్నారు.

ఏపీ ఈఏపీ సెట్ 11 మంది గైర్హాజరు

రాజానగరం, మే 22(ఆంధ్రజ్యోతి): గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయం (జీజీయూ)లోని గైట్ కళాశాలలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రంలో రెండో రోజు గురువారం జరిగిన ఏపీ ఈఏపీ సెట్-2025 ఆన్‌లైన్ పరీక్షకు రెండు సెషన్స్‌లోను 300 మంది విద్యార్థులకు గాను 289 మంది హాజరైనట్టు పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెంట్ బి.సుజాత తెలిపారు.రెండు సెషన్స్‌లో 11 మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు.

ఎర్రకాలువలో గుర్రపు డెక్క తొలగింపు


గుర్రపు డెక్కను తొలగిస్తున్న ఉపాధి కూలీలు

అనపర్తి, మే 22 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట-వేమగిరి ఎర్రకాలువలో అనపర్తి డీసీ పరిధిలో గుర్రపు డెక్క తొలగింపు కార్యక్రమం శరవేగంగా సాగుతోంది. వారం పది రోజుల పాటు కాకినాడ కాలువలో గుర్రపు డెక్క తొలగింపు చేపట్టిన ఉపాధి కూలీలు రెండు రోజులుగా ఎర్ర కాలువలో డెక్క తొలగింపు చేపట్టారు. రోజుకు సుమారు 450మందికి పైబడి ఉపాధి కూలీలు పనిచేస్తున్నారు. సాగునీటి ప్రవాహానికి ఇబ్బందిగా మారుతున్న గుర్రపు డెక్క తొలగింపు పట్ల రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



మినీ మహానాడు ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

నేడు జిల్లా టీడీపీ మినీ మహానాడు

రాజమహేంద్రవరం, మే 22(ఆంధ్రజ్యోతి) : తూర్పు గోదావరి జిల్లా మినీ మహానాడుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. స్థానిక చెరుకూరి కన్వెన్షన్ హాల్‌లో శుక్రవారం జిల్లాస్థాయి మినీ మహానాడు నిర్వహించనున్నారు.సుమారు 6వేల మంది హాజరవుతారని అంచనా వేస్తున్నారు. ఈ మేరకు మినీ మహానాడు ఏర్పాట్లను సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు పరిశీలించారు.ఈ నెల 27 నుంచి 29వ తేదీ వరకూ కడపలో జరగనున్న టీడీపీ మహానాడులో భాగంగా ముందస్తుగా జిల్లాల వారీగా మినీ మహానాడు నిర్వహిస్తున్నామన్నారు. జోన్-2 ఇన్‌చార్జి సుజయకృష్ణ హాజరవుతారన్నారు.సభా ప్రాంగణం,ఆయా ప్రాంతాల నుంచి వచ్చే ప్రతినిధుల సౌకర్యార్థం జిస్ట్రేషన్ కౌంటర్,భోజన ఏర్పాట్లు, పార్కింగ్ తదితర ఏర్పాట్లు చేశారు.జిల్లాలోని రాజమహేంద్రవరం సిటీ, రూరల్, రాజానగరం,అనపర్తి,నిడదవోలు, కొవ్వూరు, గోపాలపురం నియోజకవర్గాల నుంచి పార్టీ శ్రేణులు హాజరవుతారని చెప్పారు.





మహా పండుగ

కాకినాడ, బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లో టీడీపీ మినీ మహానాడు గురువారం పండగలా సాగింది.. ఆయా జిల్లాల నుంచి పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.. జై టీడీపీ.. జై జై టీడీపీ నినాదాలతో హోరెత్తించారు. కార్యకర్తలకు అండగా ఉండాలని నాయకులు ప్రతినబూనారు.

కాకినాడలో జరిగిన మినీ మహానాడుకు జిల్లా ఇన్‌చార్జి మంత్రి నారాయణ హాజరయ్యారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో నిర్వహించిన మినీ మహానాడుకు మంత్రి అచ్చెన్నాయుడు హాజరయ్యారు. కడపలో జరిగే మహానాడు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఆర్టీసీ జిల్లా అధికారిగా మూర్తి నియామకం

రాజమహేంద్రవరం అర్బన్, మే 22 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ తూర్పుగోదావరి జిల్లా అధికారిగా వై.సత్యనారాయణమూర్తి (వైఎస్ఎన్ మూర్తి) నియమితులయ్యారు.ప్రస్తుతం తాడేపల్లిగూడెం డిపో మేనేజర్‌గా పనిచేస్తున్నారు. జిల్లా అధికారిణిగా పనిచేసిన షర్మిల అశోక ఇటీవల బదిలీ కావడంతో ఆ స్థానంలో డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆర్టీసీ అధికారి రాఘవకుమార్ ఇన్‌ఛార్జిగా బాధ్యతలు అప్పగించారు. ఇదిలా ఉండగా వైఎస్ఎన్ మూర్తిని జిల్లా అధికారిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.సత్యనారాయణ మూర్తి ఒకట్రెండు రోజుల్లో బాధ్యతలు చేపట్టనున్నారు.

వక్ఫ్ బోర్డు నిర్వహణలోకి మదీనా మసీదు

రాజమహేంద్రవరం, మే 22 (ఆంధ్రజ్యోతి) : వక్ఫ్ బోర్డు నిర్వహణలోకి కొన్ని మసీదులను తీసుకుంటున్నారు. రాజమహేంద్రవరం దానవాయిపేటలోని మదీనా మసీదు తూర్పుగోదావరి వక్ఫ్ బోర్డు ప్రత్యక్ష నిర్వహణలోకి వెళ్లింది. ఈ నెల 20 నుంచి ఉత్తర్వులు అమల్లోకి వచ్చాయని కాకినాడ వక్ఫ్ బోర్డు ఆడిట్ ఇన్‌స్పెక్టర్ షైఫ్ తెలిపారు.



వదలని వరుణుడు

రాజమహేంద్రవరం, మే 22 (ఆంధ్రజ్యోతి): వరుణుడు వదలడం లేదు.. గత మూడు రోజులుగా ఏదో ఒక సమయంలో వర్షాలు పడుతూనే ఉన్నాయి. జిల్లాలో గురువారం 257.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. చాలా చోట్ల తెల్లవారుజాము నుంచి వర్షం కురవడం మొదలైంది. కడియం మండలంలో గరిష్ఠంగా 49.6 మిల్లీమీటర్లు, కనిష్ఠంగా బిక్కవోలులో 0.4 మిలీమీటర్లు, జిల్లా కేంద్రం రాజమహేంద్రవరం అర్బన్‌లో 4.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

కలలోను!



కార్పొరేషన్ రుణాలకు స్మాల్ బ్రేక్

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో బీసీ, ఎస్సీ, ఈబీసీ, కాపు కార్పొరేషన్ ద్వారా ఇవ్వనున్న స్వయం ఉపాధి రుణ యూనిట్లకు బ్రేక్ పడింది. వీటిని తక్షణం నిలిపివేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఎంపిక చేసిన లబ్ధిదారులకు సబ్సిడీ, రుణం మంజూరు ఆపేయాలని సూచించింది. త్వరలో భారీగా అదనపు రుణ యూనిట్లు, లబ్ధిదారులను పెంచడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ కీలక నిర్ణయం తీసుకుంది.



వందల్లో యూనిట్లు.. వేలల్లో దరఖాస్తులు

ఐదేళ్ల తర్వాత మళ్లీ పథకం అమల్లోకి రావడంతో యూనిట్లు వంద ల్లో ఉంటే దరఖాస్తుదారులు వేలల్లో వచ్చారు. బీసీ కార్పొరేషన్ రుణాల కింద కాకినాడ జిల్లాకు రూ.39.52 కోట్ల విలువైన 1,914 యూనిట్లు మంజూరు చేస్తే ఏకంగా 31,859 మంది, తూర్పుగోదావరి జిల్లాలో రూ.28.87 కోట్ల విలువైన 1,374 యూనిట్లకు 16,408 మంది, కోనసీమ జిల్లాలో రూ.29.54 కోట్ల విలువైన 1,394 యూనిట్లకు 15,147మంది పోటీపడ్డారు.కాపు కార్పొరేషన్ కింద రూ.28.24 కోట్ల విలువైన 763 యూనిట్లకు 21,454, తూర్పుగోదావరి జిల్లాలో రూ.27.15 కోట్ల విలువైన 757 యూనిట్లకు 8,193 మంది, కోనసీమ జిల్లాలో రూ.27.14 కోట్ల విలువైన 757 యూనిట్లకు 15,644 మంది పోటీ పడ్డారు. ఈడబ్ల్యూఎస్ కార్పొరేషన్ కింద ఉమ్మడి జిల్లాకు రూ.14 కోట్ల విలువైన 511 యూనిట్లు మంజూరు చేయగా, రూ.6 వేల మంది వరకు దరఖాస్తులు చేశారు. ఎస్సీ కార్పొరేషన్ కింద కాకినాడ జిల్లాకు 798 యూనిట్లు మంజూరవగా 5,497, కోన సీమ జిల్లాకు 1,043 యూనిట్లకు 3,265 మంది, తూర్పుగోదావరి జిల్లాలో 891 యూనిట్లకు 4,555 మంది దరఖాస్తు చేశారు.

5,137 యూనిట్లు..

గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో కార్పొరేషన్లను పూర్తిగా నిర్వీర్యం చేసింది. పేదలకు ఒక్క యూనిట్ కూడా మంజూరు చేయకుండా ఆపేసింది. ప్రస్తుత ప్రభుత్వం తిరిగి ఇటీవల వీటిని పునరుద్ధరించింది. సీఎం చంద్రబాబు మళ్లీ కార్పొరేషన్ల ద్వారా బీసీ, కాపు, ఎస్సీ, ఈడబ్ల్యూఎస్ వర్గాలకు స్వయం ఉపాధి యూనిట్లు మంజూరు చేయాలని నిర్ణయించారు. వ్యాపారాన్ని బట్టి ప్రభుత్వం 40 నుంచి 60 శాతం సబ్సిడీ, మిగిలింది బ్యాంకు రుణం, ఐదు శాతం వరకు లబ్ధిదారుడి వాటా కింద విభజించారు. ఈ రెండు కార్పొరేషన్ల ద్వారా రూ.316 కోట్ల విలువైన స్వయం ఉపాధి యూనిట్లను పేద యువతకు అందించి వారిని ఆర్థికంగా నిలబెట్టేందుకు నిర్ణయించింది. బీసీ, ఎస్సీ కార్పొరేషన్ల ద్వారా ఉమ్మడి జిల్లాకు 5,137 యూనిట్లను మంజూరు చేసి దరఖాస్తులు ఆహ్వానించింది. ఏకంగా 45,765 మంది పోటీపడ్డారు. అనేకమందికి పథకం అందని పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో మళ్లీ యూనిట్లను పెంచి మరింత మందికి లబ్ధి చేకూర్చాలని ప్రభుత్వం భావిస్తోంది. దీనిలో భాగంగా ప్రస్తుతం అర్హుల ఎంపికను నిలిపివేసి కొత్తగా మరింత మందిని ఎంపిక చేసి అందరికీ ఒకేసారి ఈ పథకం అమలు చేయడం కోసమే తక్షణ నిర్ణయమని చెబుతున్నారు.


లబోదిబో...

ఐదేళ్ల తర్వాత పథకం అమలవుతుండడంతో యూనిట్లను దక్కించుకునేందుకు వేలాదిగా పోటీపడడంతో కేవలం వందల్లో మాత్రమే లబ్ధిదారులు రుణాలకు ఎంపికయ్యారు. ఎంపిక కాని వేలాది మంది పేద యువత, నిరుద్యోగులు తమకు న్యాయం చేయాలంటూ అనేక చోట్ల ఎమ్మెల్యే వద్దకు క్యూ కట్టారు. ఇన్నేళ్లు నిరీక్షిస్తే తమకు ఇంకెప్పుడు న్యాయం జరుగుతుందంటూ విజ్ఞప్తులు అందించారు. దీంతో

- కలవరింత... పెంపు మరింత
- జాబితాలు నిలిపేయాలని ఆదేశం
- యూనిట్లు తక్కువవడమే కారణం
- కార్పొరేషన్లకు 5,137 యూనిట్లు
- 45,765 దరఖాస్తులు
- వందల్లో ఎంపికైన లబ్ధిదారులు
- అనేక మందికి దక్కని అవకాశం
- ఎమ్మెల్యేలను నిలదీస్తున్న వైనం
- పెంచాలని ప్రభుత్వంపై ఒత్తిడి
- త్వరలో భారీగా పెంచే యోచన
- యూనిట్ల పెంపుపై కసరత్తు
- అందుకే నిలిపివేసిన ప్రభుత్వం

అనేక మంది ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎమ్మెల్యేలు విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు. వందల్లో రుణ యూనిట్లు సరిపోవని వివరించారు. క్షేత్ర స్థాయి పరిస్థితులపై అధికారుల ద్వారా నివేదిక రప్పించుకున్న ఉన్నతాధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ప్రస్తుతం కేటాయించిన యూనిట్లు చాలా తక్కువగా ఉన్న నేపథ్యంలో ఇవి రెట్టింపు చేయాల్సిన అవసరం ఉందనే చర్చ ప్రభు త్వంలో జరిగింది. రెట్టింపు చేయాలా? ఇంకా పెంచాలా? అనేదానిపై ప్రస్తుతం ఉన్నత స్థాయిలో కసరత్తు జరుగుతోంది. ఈ సంగతి తేల్చే వరకు ఇది వరకే ఎంపిక చేసిన లబ్ధి దారుల జాబితా నిలిపివేయాలని అధికారులు నిర్ణయించారు. పెంచబోయే యూనిట్లను కలిపి అందరికే ఒకేసారి పథకం వర్తింపజేయాలని జిల్లాల్లో అధికారులకు సమాచారం అందింది. దీంతో ప్రస్తుతం మండల స్థాయిలో పథకాలకు ఎంపికై బ్యాంకు రుణాలకు ఎదురుచూస్తోన్న లబ్ధిదారులను హోల్డ్‌లో ఉంచారు. ఈ నేపథ్యంలో బీసీ కార్పొరేషన్ కింద మంజూరైన 1,042, ఈడబ్ల్యూఎస్ కార్పొరేషన్ కింద మంజూరైన 73, కాపు కార్పొరేషన్ కింద ఎంపికచేసిన 570 లబ్ధిదారులను నిలిపివేశారు. త్వరలో భారీ స్థాయిలో యూనిట్లను పెంచి ఎక్కువమంది యువతకు పథకాన్ని అమలుచేయనుంది.

కిలో నెయ్యి.. రూ.250



కల్తీ నెయ్యి

ఆత్రేయపురం పూతరేకుల్లో కల్తీ నెయ్యి

ఆత్రేయపురం, మే 22 (ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం పేరు చెప్పగానే గుర్తుకు వచ్చేది పూతరేకులే.. రోజూ కోట్లాది రూపాయల వ్యాపారం.. ఆ వ్యాపారానికి నెయ్యి ఎక్కడి నుంచి వస్తుందనేది ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది. ఎందుకంటే నెయ్యి వాడని పూతరేకు ఉండదు. ఎన్నో ఏళ్ల కిందట ఆత్రేయపురంలో పుట్టిన పూతరేకుకు దేశ విదేశాల్లో ఎంతో డిమాండ్ ఉంది. మహిళలు కుటీర పరిశ్రమగా పూతరేకులు తయారుచేస్తూ ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారు. పూతరేకులకు డిమాండ్ పెరగడంతో అక్రమార్కులు ఎక్కడపడితే అక్కడ పూతరేకుల వ్యాపారాలు సాగిస్తూ కల్తీ నెయ్యి వినియోగిస్తూ అమ్మకాలు సాగిస్తున్నారు.

- విచ్చలవిడిగా అమ్మకాలు
- పూతరేకుల్లో వినియోగం
- పశువుల కొవ్వు నుంచి తయారీ
- చిరు వ్యాపారులతో అమ్మకాలు
- ప్రజారోగ్యంతో చెలగాటం

ఆత్రేయపురంలో రోడ్ల వెంబడి ఉన్న దుకాణాల్లో కొందరు వ్యాపారులు గత కొంతకాలంగా యథేచ్ఛగా నకిలీ నెయ్యిని వినియోగిస్తూ ప్రజల ఆరోగ్యాలతో చెలగాటం ఆడుతున్నారు. పశుమాంసం ద్వారా కొవ్వును తీసి కల్తీ నెయ్యి తయారు చేస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. ఒరిజినల్ నెయ్యిలా ఉండేలా కొన్ని మిశ్రమాలు కలిపి ఈ కల్తీ నెయ్యిని తయారు చేస్తున్నట్టు సమాచారం. ఏలూరు, విజయవాడ, విశాఖపట్నం తదితర ప్రాంతాల నుంచి ఈ నకిలీ నెయ్యిని తెచ్చి వ్యాపారుల ద్వారా అమ్మకాలు సాగిస్తున్నారు. ఆత్రేయపురంలోని కొన్ని షాపుల ద్వారా ఈ నెయ్యి వ్యాపారం యథేచ్ఛగా సాగిపోతోంది. ఈ కల్తీ నెయ్యిని కిలో రూ.250కు చిరువ్యాపారులకు విక్రయిస్తున్నారు. ధర తక్కువగా ఉండడం.. చూస్తే నెయ్యిలా కనిపించడంతో ఆ నెయ్యినే వినియోగించి కొందరు పూత రేకులు తయారుచేస్తున్నారు. ఈ కల్తీనెయ్యి విచ్చలవిడిగా వినియోగించడం ద్వారా ప్రజలు ఆరోగ్యానికి తూట్లు పొడుస్తున్నారు. క్యాన్సర్, ఉదర సంబంధిత వ్యాధులు సంభవించే అవకాశాలు ఉన్నాయని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. గత ఫిబ్రవరి నెలలో ఫుడ్‌సేఫ్టీ అధికారులు పూతరేకుల తయారీ, నెయ్యి వ్యాపారుల స్థావరాలపై దాడులు చేసి కేసులు పెట్టినా షరామామూలే.



అధికారులు పట్టుకున్న కల్తీ నెయ్యి

80 కిలోల కల్తీ నెయ్యి స్వాధీనం

ఆత్రేయపురంలోని కల్తీ నెయ్యి అమ్మకాలు సాగిస్తున్న ఓ షాపుపై స్థానికులు గుర్తించి పోలీస్, రెవెన్యూ అధికారులకు సమాచారం అం దించారు. ఆత్రేయపురం శ్రీలక్ష్మి డ్రైఫూట్స్ షాపులో గురువారం 80 కిలోల కల్తీనెయ్యిని పట్టుకుని స్థానికులు పోలీస్, రెవెన్యూ అధికారులకు సమాచారం అందించారు. షాపునకు చెందిన గొడౌన్లలో అమ్మకానికి సిద్ధంగా ఉన్న 80 కిలోల కల్తీనెయ్యిని స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఎస్‌ఐ రాము ఫుడ్‌సేఫ్టీ అధికారులకు సమాచారం అందించారు. ఫుడ్‌సేఫ్టీ అధికారి శ్రీకాంత్‌చౌదరి కల్తీ నెయ్యి సీజ్ చేశారు. శాంపిల్స్ ల్యాబ్‌కు పంపి తదుపరి చర్యలు చేపడతామని తెలిపారు.



సంచుల్లో నిల్వ ఉంచిన కల్తీ నెయ్యి ప్యాకెట్లు

బొమ్మూరులోనే కలెక్టరేట్!



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి, జేసీ చిన్నరాముడు

- త్వరలో సైన్స్ మ్యూజియం ఆరంభం
- ఇసుక డ్రెడ్జింగ్‌పై నిఘా ఉంది
- జూన్ 21 వరకూ రోజూ యోగా
- వై.జంక్షన్-లాలాచెరువు సందడి
- 29న సెంట్రల్ జైలులో ప్రోగ్రాం
- కలెక్టర్ ప్రశాంతి వెల్లడి

రాజమహేంద్రవరం,మే22(ఆంధ్రజ్యోతి) : జిల్లా కలెక్టరేట్ బొమ్మూరులో ఉంటుందనే అభిప్రాయం కలెక్టర్ వ్యక్తం చేశారు. కలెక్టర్ క్యాంపు ఆఫీసులో జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి గురువారం విలేకరులు అడిగిన పలు ప్రశ్నలకు స్పందించారు. జిల్లా కలెక్టరేట్ శాశ్వత భవనాలు ఎక్కడ కట్టడానికి నిర్ణయించారని ఒకరు అడగ్గా.. బొమ్మూరులోని ప్రస్తుత కలెక్టరేట్‌కు అందరూ అలవాటు పడ్డారు కదా అని ఆమె చెప్పారు. గత పుష్కరాల సమయంలో శాంక్షన్ అయిన సైన్స్ మ్యూజియంను నిర్మించినా ఎపుడు ప్రారంభిస్తారని ఒకరు ప్రశ్నించగా అదే ఏర్పాట్లలో ఉన్నట్టు స్పష్టం చేశారు. రివర్ ఫ్రంట్ నిర్మాణం వల్ల మహనీయుల విగ్రహాలు తొలగిస్తారని, పిండాల సత్రాన్ని తొలగిస్తారట కదా అని మరొకరు ప్రశ్నించారు. రివర్ ఫ్రంట్ అభివృద్ధిలో భాగంగా మహనీయుల విగ్రహాలను గౌరవప్రదంగా తొలగించి తర్వాత ఏర్పాటు చేస్తామన్నారు. కంబాల సత్రం గురించి ఆరా తీస్తానని తెలిపారు. ఇసుక డ్రెడ్జింగ్‌పై నిఘా ఉందని కేసులు నమోదు చేస్తున్నామన్నారు. జిల్లాలో 7లక్షల టన్నుల ఇసుక స్టాక్ చేయడం లక్ష్యంగా ర్యాంపులు ఇచ్చినట్టు చెప్పారు. తెలుగు విశ్వవిద్యాలయానికి ప్రస్తుతం ఉన్న ప్రాంగణంలో 15 ఎకరాల భూమి ఉందని చెప్పారు. టాటా ఇన్నోవేషన్ హబ్‌కు ఐదెకరాల భూమితో పాటు ఓ ప్రైవేట్ భవనాన్ని చూశామని, ఇది గెయిల్, ఓఎన్‌జీసీ ,ఇతర ప్రైవేట్ సంస్థల ఆధ్వర్యంలో నడుస్తుందని, అధికారుల పాత్ర తక్కువ ఉంటుందన్నారు.

యోగాపై అవగాహన పెంచండి

రాజమహేంద్రవరం అర్బన్, మే 22 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రాన్ని యోగాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యంగా జరుగుతున్న కార్యక్రమంలో భాగంగా జిల్లాలో నెల రోజుల పాటు యోగా సాధన కార్యక్రమాలు ఉంటాయని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో గురువారం యోగాంధ్రప్రదేశ్ కార్యక్రమంపై సమన్వయశాఖల అధికారులతో సమీక్షించారు. జూన్ 1న రాష్ట్రవ్యాప్తంగా 2 కోట్ల మందితో రికార్డుస్థాయిలో యోగా చేయించాలనే లక్ష్యంలో భాగంగా నగరంలోని రాజమహేంద్రవరంలోని వై.జంక్షన్ నుంచి లాలాచెరువు వరకూ ప్రతిరోజూ ఉదయం 7 నుంచి 8 గంటల మధ్య యోగా సాధన కార్యక్రమాలు చేపట్టనున్నట్టు తెలిపారు. రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో రాష్ట్రస్థాయి కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు. ఈ కార్యక్రమాల్లో మీడియా కూడా భాగస్వామ్యం కావాలన్నారు. రోజుకు ఒక శాఖ చొప్పున నెల రోజులపాటు అన్ని శాఖలు యోగా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ప్రజల్లో యోగా పట్ల అవగాహన పెంచాలని సూచించారు. డివిజన్లలో ఆర్డీవోలు కో ఆర్డినేటర్‌గా కార్యక్రమాలు చేపడతారన్నారు.కార్యక్రమంలో జేసీ చిన్నరాముడు, జైళ్లశాఖ ఎస్పీ రాహుల్, డీఆర్వో సీతారామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ కోవిడ్ కలకలం

అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలు

రాజమహేంద్రవరం అర్బన్, మే 22 (ఆంధ్రజ్యోతి) : కొవిడ్‌తో అప్ర మత్తంగా ఉండాలని డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్‌హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ ఉన్నతాధికారులు కొవిడ్ ముందస్తు హెచ్చరికలు జారీ చేశారు. దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో కొవిడ్ కేసులు నమోదవుతున్న నేపథ్యంలో ముందస్తుగా హెచ్చరించారు. ఈ మేరకు రాజమహేంద్రవరం ప్రభుత్వ బోధనాసుపత్రితో సహా జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రులకు, వైద్యాధికారులకు స్పష్టమైన ఆదేశాలిచ్చారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మార్గనిర్దేశం చేశారు. ప్రజలు ఎలాంటి అనుమానిత లక్షణాలు కనిపించినా తగు జాగ్రత్తలు తీసుకోవడంతోపాటు చికిత్స తీసుకోవాలని సూచించారు. హెల్త్ డిపార్టుమెంట్ 24/7 అప్రమత్తంగా ఉండాలని, మాస్కులు సిద్ధం చేసుకోవాలని, పీపీఈ కిట్లు అందుబాటులో ఉంచుకోవాలని, ట్రిపుల్ లేయర్ మాస్కులను రెడీ చేసుకోవాలని, అన్ని రకాలైన టెస్టింగ్ సౌకర్యాలతో ల్యాబ్‌లను సిద్ధం చేసుకోవాలని ఆదేశాల్లో పేర్కొన్నారు.



రెక్కలు కొట్టుకుంటున్నాయ్!

ఫ్యాన్ పార్టీలో ముదిరిన వివాదం



వైసీపీ పరిశీలకుడు తిప్పల గురుమూర్తి రెడ్డి నిర్వహించిన సమావేశానికి హాజరైన నాయకులు

- నాడు రాజా వర్సెస్ భరత్
- నేడు వేణు వర్సెస్ భరత్
- పరిశీలకుడు వచ్చినా గైర్హాజరు
- మాజీ ఎంపీ తీరుపై అసహనం
- ఇటీవల క్లాస్..మారని తీరు

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

అధికారం కోల్పోయినా వైసీపీ నేతలకు గుణపాఠం రావడం లేదు. కొందరు తమ వైఖరిని మార్చుకోకపోతుంటే.. కొందరు మధ్య ఆధిపత్య పోరు పెరిగింది. అధికారంలో ఉండగా, అప్పట్లో ఎంపీగా ఉన్న మార్గాని భరత్‌రామ్, అప్పట్లో ఎమ్మెల్యేగా ఉన్న జక్కంపూడి రాజా మధ్య తీవ్రస్థాయిలో విబేధాలు పొడచూపిన సంగతి తెలిసిందే. అయినా ఎవరికి వారు తమ వర్గాన్ని పోషించుకుంటూ వచ్చారు. గత ఎన్నికల్లో అందరూ ఓడిపోయారు. రాజమహేంద్రవరం రూరల్ నుంచి వైసీపీ అభ్యర్థిగా మాజీ మంత్రి చెల్లుబోయిన వేణు పోటీ చేసిన సంగతి తెలిసిందే. ఆయన ప్రస్తుతం వైసీపీ జిల్లా అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. ఏమి జరిగిందో కానీ మాజీ మంత్రి వేణు, మాజీ ఎంపీ భరత్ మధ్య గ్యాప్ బాగా పెరిగింది. కొద్ది రోజుల కిందట వీరి వ్యవహారం అధిష్ఠానం వద్ద పంచాయితీకి కూడా దారితీయడం గమనార్హం. జగన్ ఆదేశాల మేరకు మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ, సజ్జల రామకృష్ణారెడ్డి వీరిద్దరినీ పిలిచి క్లాస్ తీసుకున్నట్టు సమాచారం. వేణు జిల్లా అధ్యక్షుడిగా అందరినీ కలుపుకుని పోకుండా, తనకు వ్యతిరేకంగా కొందరితో చేతులు కలిపినట్టు భరత్ ఆరోపించినట్టు తెలిసింది.కానీ తాను జిల్లా అధ్యక్షుడిగా చేపట్టిన కార్యక్రమాలు కాకుండా భరత్ ఒంటెత్తు పోకడతో వెళుతున్నట్టు వేణు వాదించినట్టు సమాచారం. కానీ అధిష్ఠానం వీరిద్దరికి గట్టిగా చెప్పి పంపించడం గమనార్హం. కానీ అయినా వారి మధ్య సయోధ్య కుదిరినట్టు లేదు. రాజమహేంద్రవరం పార్లమెంట్ ఇన్‌చార్జి వైసీపీ పరిశీలకుడిగా తిప్పల గురుమూర్తి రెడ్డి గురువారం జిల్లాలోని నియోజకవర్గాల ఇన్‌చార్జిలతో సమావేశం నిర్వహించారు. బొమ్మూరులోని వైసీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి చెల్లుబోయిన వేణు కార్యాలయంలో వేణు అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి మాజీ ఎంపీ మార్గాని భరత్ హాజరుకాలేదు. ఆయన హైదరాబాద్ వెళ్లినట్టు సమాచారం.సమావేశంలో మాజీహోం మంత్రి తానేటి వనిత, యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జి డా.గూడూరి శ్రీనివాస్,మాజీ ఎమ్మెల్యేలు డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, తలారి వెంకట్రావు, జి. శ్రీనివాసనాయుడు పాల్గొన్నారు.

జిల్లా ఓటర్లు 16,21,270

డీఆర్వో సీతారామ మూర్తి

రాజమహేంద్రవరం,మే 22 (ఆంధ్రజ్యోతి): పోలింగ్ కేంద్రాల్లో ఓటర్ల సంఖ్య హేతుబద్ధీకరణకు చర్యలు తీసుకుంటున్నామని, రాజకీయ పార్టీలు తమ వంతుగా సహకరించాలని జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్వో) టి.సీతారామమూర్తి కోరారు. కలెక్టరేట్‌లో గురువారం సాయంత్రం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన సమావేశం నిర్వహించారు. జిల్లాలోని 1581 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. 1191 కేంద్రాల్లో 1200 మంది కంటే తక్కువ ఓటర్లు ఉండగా.. మిగతా వాటిలో 1200 కంటే ఎక్కువగా ఉన్నారని తెలిపారు. హేతుబద్ధీకరణ ద్వారా సమంగా ఉండేలా చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు. క్షేత్ర స్థాయిలో పరిశీలనకు రాజకీయ పార్టీల సూచనలు, సలహాలు తీసుకుంటున్నామన్నారు. జిల్లాలో 16,21,270 మంది ఓటర్లు ఉన్నారన్నారు. ఈ ఏడాది జనవరి 6 నుంచి ఇప్పటి వరకూ 10,630 ఫారం 6, 7, 8 స్వీకరించగా..10,620 పరిష్కరించామన్నారు. ఎవరైనా కొత్త ఓటర్లు ఉంటే దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

కొవ్వూరులో రైళ్ల హాల్టింగ్‌కు కృషి : జవహర్



కొవ్వూరులో జవహర్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైల్వే పరిరక్షణ సమితి సభ్యులు

కొవ్వూరు, మే 22 (ఆంధ్రజ్యోతి) : చారిత్రక పట్టణమైన కొవ్వూరు రైల్వే స్టేషన్‌లో కొవిడ్‌కు ముందు ఆగే రైళ్లకు హాల్టులు కల్పించేందుకు కృషి చేస్తానని రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్, మాజీమంత్రి కేఎస్ జవహర్ అన్నారు. ఈ మేరకు గురువారం రైల్వే పరిరక్షణ సమితి సభ్యులు అతన్ని కలిసి వినతిపత్రం అందజేశారు. ముందుగా శాలువాతో కప్పి సత్కరించారు. జవహర్ మాట్లాడుతూ కొవ్వూరు పట్టణంలో గోష్పాదక్షేత్రం పర్యాటకంగా బాగా ప్రాచుర్యం పొందింది. అటువంటి ఈ ప్రాంతంలో రైళ్ల నిలుపుదలచేయకపోవడం బాధాకరమన్నారు. పరిరక్షణ సమితి చేస్తున్న పోరాటానికి మద్దతు తెలుపుతున్నానన్నారు. కోవిడ్‌కు ముందు 34 రైళ్ల నిలిచేవి, వాటిని తిరిగి పునరుద్ధరించాలని సమితి సభ్యులు కోర్టును ఆశ్రయించారన్నారు. కోర్టు ఉత్తర్వులను లెక్కచేయకపోవడం. జూన్ 5,6 తేదీలలో కమిషన్ తరఫున సమన్లు ఇచ్చి రైళ్ల నిలుపుదలకు చర్యలు తీసుకుంటామన్నారు. అవసరమైతే రైల్వేశాఖ మంత్రితో మాట్లాడి సమస్యను అతి త్వరలో పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు.

ఆయిల్ ఫామ్ పంటలపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న ఉద్యానవన శాఖ అధికారి బబిత, తదితరులు

నల్లజర్ల, మే 22 (ఆంధ్రజ్యోతి): ఆయిల్ ఫాం తోటలపై రైతులు ప్రత్యేక శ్రద్ధ చూపించాలని ఉద్యానవనశాఖ అధికారి బబిత అన్నారు. గురువారం నల్లజర్లలో త్రీఎఫ్ ఆయిల్‌ఫాం కంపెనీ, ఉద్యానశాఖ సంయుక్తంగా రైతులకు ఆయిల్ ఫాం పంటలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతుల పంటకు వినియోగించాల్సిన ఫెర్టిలైజర్, డ్రిప్ వ్యవస్థ, తెగులు గుర్తించడం, నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో త్రీఎఫ్ సంస్థ డీజీఎం సూర్యారావు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

'క్రీడలతో మానసికోల్లాసం'



దూబచర్ల సంఘమిత్ర స్కూల్‌లో మాట్లాడుతున్న జిల్లా స్పోర్ట్స్ అథారిటీ చీఫ్ కోచ్ శేషగిరి

నల్లజర్ల, మే22 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని జిల్లా స్పోర్ట్స్ అథారిటీ చీఫ్ కోచ్ ఎం. శేషగిరి అన్నారు. గురువారం దూబచర్ల సంఘమిత్ర స్కూల్‌లో జరుగుతున్న వేసవి శిక్షణ శిబిరాన్ని పరిశీలించి ఆయన మాట్లాడుతూ వేసవిలో విద్యార్థులకు యోగా, చెస్, వాలీబాల్ శిక్షణలో ప్రావీణ్యం సాధించడం ఆనందదాయకమన్నారు. అందుకు కృషిచేసిన యోగా మిత్ర డి. రాజారావును అభినందించారు. వేసవి శిక్షణ శిబిరాన్ని ఏర్పాటుచేసి పార్ట్ ఇం డియా సేవా సంస్థ జాతీయ అధ్యక్షుడు అం బటి శ్రీనివాసరావును అభినందించారు. కార్య క్రమంలో చీమకుర్తి కృష్ణప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి విద్యుత్ సరఫరాకు అంతరాయం

చాగల్లు, మే 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చంద్రవరం, మార్కొండపాడు, గౌరిపల్లిలో శుక్రవారం నుంచి 27వ తేదీ వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎన్. నారాయణ అప్పారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్‌డీఎస్‌ఎస్ వర్క్స్, కొత్తలైను ఏర్పాటు వల్ల ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు సరఫరా ఉండదన్నారు. వ్యవసాయ విద్యుత్ ఉదయం నాలుగు గంటల నుంచి 8 వరకు, మిగిలిన విద్యుత్ రెండు గంటల నుంచి ఇస్తారని తెలిపారు.

ఘనంగా హనుమజ్జయంతి

● ఆంజనేయ స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అన్నదానాలు



కొవ్వూరు పట్టణంలో దర్శనమిస్తున్న స్వామివారు

కొవ్వూరు, మే 22 (ఆంధ్రజ్యోతి): పట్టణం, మండలంలో గురువారం హనుమజ్జయంతిని ఘనంగా నిర్వహించారు. పశివేదల పాటిచెరువు వద్ద వేంచేసియున్న అభయాంజనేయ స్వామి, శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో 25వ హనుమాన్ జయంతి వార్షికోత్సవాలు జరిగాయి. ఉత్సవమూర్తులను వివిధ కళాకారులతో ఊరేగించారు. అభయాంజనేయ స్వామికి అభిషేకాలు, సింధూరం, తమలపాకులతో పూజాకార్యక్రమాలు నిర్వహించారు. గ్రామానికి చెందిన ఈడుపుగంటి కృష్ణప్రసాద్, యామిని కృష్ణ దంపతులు శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారి కల్యాణాన్ని జరిపించారు. అనంతరం సుమారు ఐదువేల మంది భక్తులకు ఆలయకమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ఆలయకమిటీ సభ్యులు, పశివేదల గ్రామస్థులు, భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. అలాగే బసివిరెడ్డిపేట ఆంజనేయస్వామి ఆలయంలో అర్చకుడు గొడవర్తి సత్యానారాయణాచార్యుల ఆధ్వర్యంలో పంచామృత తిరుమంజన స్నపనము నిర్వహించారు. మచిలీపట్నంకు చెందిన శ్రీమాన్ ఎన్.ప్రసాద్ భజన మండలి సభ్యులు ఉదయం నుంచి శ్రీరామనామ సంకీర్తనలు ఆలపించారు. ట్యాక్సీస్టాండ్, కోర్టు వద్ద, రైల్వేస్టేషన్, మండలంలోని పలుప్రాంతాల్లోని ఆంజనేయ స్వామిఆలయాల్లో విశేషపూజలు నిర్వహించారు.

పెరవలి: మండలంలో హనుమత్ జయంతి సందర్భంగా జరిగిన పలు కార్యక్రమాల్లో మంత్రి దుర్గేష్, స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ శేషారావు పాల్గొన్నారు. కానూరు అభయాంజనేయ స్వామివారి ఆలయంలో అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో మాజీఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు పాల్గొని పూజలు చేశారు. అలాగే పెరవలి హైవేసెంటర్‌లో ఉన్న ఆంజనేయస్వామి వారి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఖండవల్లి ఆంజనేయస్వామివారి ఆలయం వద్ద హనుమాన్ పూజ, అన్నసమారాధన నిర్వహించారు.

తాళ్లపూడి: మండలంలోని పలుగ్రామాల్లో గురువారం హనుమజ్జయంతి సందర్భంగా ఆంజనేయస్వామి ఆలయాల్లో విశేషపూజలు నిర్వహించారు. ప్రక్కిలంకలో స్వామివారికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం లక్ష తమలపాకులతో విశేషపూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు సొలస కాశీ విశ్వనాథం, గిరిధర గాంధీ, భక్తులు, గ్రామస్థులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం ప్రసాద వితరణ , తదితర పూజలు గావించారు.

దేవరపల్లి: మండలంలో హనుమాన్ జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. దేవరపల్లి-గోపాలపురం రోడ్డులోని వెంకటేశ్వరస్వామి ఆలయం, పల్లంట్లలో ఉన్న హనుమాన్ ఆలయం వద్ద జయంతి అన్నసమా రాధనలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేకించి లక్ష తమలపాకులు, సింధూరంతో పూజలు చేశారు. పల్లంట్ల ఆలయం వద్ద భారీ అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో మేడికొండ చినకృష్ణారావు దంపతులు వల్లభనేని వెంకట్రామణ దంపతులు పీటలమీద కుర్చుని పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు గడా రామచంద్రం, మొగలపు హనుమంతు, బలుసు సత్యానారాయణ, కొయ్యల మూడి చినబాబు, గన్నమని జనార్ధనరావు, కూచిపూడి సతీశ్, తదితరులు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: మండలంలోని పలు గ్రామాల్లో హనుమాన్ జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ఉండ్రాజవరంలో అభయాంజనేయస్వామి ఆలయం వద్ద స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. వెలగదుర్రులో ఆంజనేయస్వామివారి ఆలయం వద్ద అన్నసమారాధన నిర్వహించారు. కె.సావరంలో ఆంజనేయ స్వామి వారిని ఊరేగించారు. అలాగే తాడిపర్రు, మోర్త, వేలివెన్ను, వడ్లూరు, సత్యవాడ, పాలంగి, తదితర గ్రామాల్లో పూజలు జరిపారు.



పెరవలిలో మంత్రి దుర్గేష్, శేషారావును శాలువాలతో కప్పి ఆశీర్వదిస్తున్న దృశ్యం



దేవరపల్లి : పల్లంట్లలో అన్నసమారాధన నిర్వహిస్తున్న దృశ్యం



ఉండ్రాజవరం: వెలగదుర్రులో అన్నసమారాధనలో పాల్గొన్న భక్తులు

'చలో విజయవాడకు తరలిరావాలి'



గోడపత్రికను ఆవిష్కరిస్తున్న తహశీల్దార్ అజయ్‌బాబు

గోపాలపురం, మే 22 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 5వ తేదీన విజయవాడలో జరగనున్న ఉద్యోగుల సంఘం రాష్ట్ర 3వ కౌన్సిల్ మహాసభలకు ఉద్యోగ, ఉపాధ్యాయులంతా భారీగా తరలిరావాలని గోపాలపురం తాలూకా ఏపీజీఈఏ కమిటీ కార్యదర్శి బలరామ్, కే.నల్లరాజు పిలుపునిచ్చారు. గురువారం తహశీల్దార్ కార్యాలయంలో మహాసభలకు సంబంధించిన గోడపత్రికలను తహశీల్దార్ కే.అజయ్‌బాబు ఆవిష్కరించారు.

కార్యక్రమంలో వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

'గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు'



యర్నగూడెం గ్రంథాలయంలో విద్యార్థులతో మాట్లాడుతున్న శేఖర్‌బాబు

దేవరపల్లి, మే 22 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని జిల్లా గ్రంథాలయ కార్యదర్శి శేఖర్ బాబు అన్నారు. యర్నగూడెం శాఖ గ్రంథాలయంలో వేసవిశిక్షణ శిబిరంలో జరుగుతున్న కార్యక్రమానికి ఆయన హాజరై విద్యార్థులకు పలుసూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం శేఖర్ బాబు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే గ్రంథాలయాల్లో పుస్తకాల పఠనం వల్ల విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి అనిత, వ్యాయామ ఉపాధ్యాయుడు మురళి, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ రుణాలు మంజూరు చేయాలి



బ్యాంకర్లతో మాట్లాడుతున్న డీపీఎం శ్రీనివాస్

గోపాలపురం, మే 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన స్వయం ఉపాధి సోపానం పథకంలో దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ రుణాలు మంజూరు చేయాలని డీపీఎం ఏ.శ్రీనివాస్ అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో స్వయం ఉపాధి సోపానం రుణాల మంజూరు, అమలుపై బ్యాంకు మేనేజర్లతో గురువారం సమావేశాన్ని నిర్వహించారు. ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీనివాస్ అధ్యక్షతన కార్యక్రమం జరిగింది. గోపాలపురం, దేవరపల్లి, నల్లజర్ల మండలాల్లోని ఆయాశాఖల బ్యాంక్ మేనేజర్లు, ఏపీఎంలు, సీసీలు పాల్గొన్నారు.

'కోవిడ్‌పై అప్రమత్తంగా ఉండండి'

తాళ్లపూడి, మే 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం ఆదేశాల మేరకు కోవిడ్ తిరిగి విజృంభిస్తున్న నేపథ్యంలో ప్రజలంతా ముందస్తు జాగ్రత్త ఉండాలని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ హారికాగుప్త తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఆమె తాళ్లపూడిలో మాట్లాడుతూ ప్రజలందరూ ఆరోగ్యజాగ్రత్తలు పాటించాలని సూచించారు.ముఖ్యంగా ప్రజలు ఎక్కువగా తిరిగే ప్రాంతాలను నిరోధించాలని, బస్‌స్టేషన్, రైల్వే స్టేషన్, ఎయిర్‌పోర్టు వంటి ప్రదేశాలకు వెళ్లినప్పుడు తప్పనిసరిగా మాస్క్ ధరించాలన్నారు.

ప్రవీణ్ మృతిపై నివేదిక అందించాలని కోరడంపై హర్షం

కొవ్వూరు, మే 22 (ఆంధ్రజ్యోతి): ప్రవీణ్ పగడాల అనుమానాస్పద మృతిపై 21 రోజులలో నివేదిక పంపాలని జాతీయ మైనారిటీ కమిషన్ రాష్ట్ర చీఫ్ సెక్రటరీని కోరడంపై లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కన్వీనర్ బొంతా శ్యాం రవిప్రకాష్ హర్షం వ్యక్తం చేశారు.

బైక్ దొంగతనంపై కేసు నమోదు

కొవ్వూరు, మే 22 (ఆంధ్రజ్యోతి): బైక్ దొంగతనంపై కేసునమోదు చేసినట్టు పట్టణ హెడ్ కానిస్టేబుల్ ఆర్. సాంబమూర్తి తెలిపారు. మడికి గ్రామానికి చెందిన తాతపూడి రాజు ఈ నెల 16వ తేదీన బైక్‌పై కొవ్వూరు గోష్పాదక్షేత్రానికి వచ్చారు. బైక్‌పై పార్క్ చేసి గోదావరినదిలో స్నానం చేసి వచ్చేసరికి బైక్ కనిపించలేదు. చుట్టుప్రక్కల వెతికినా కనిపించకపోవడంతో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసినట్టు హెచ్‌సీ సాంబమూర్తి తెలిపారు.

కోకో పెంపకాన్ని ప్రోత్సహించాలి : కలెక్టర్

రాజమహేంద్రవరం అర్బన్, మే 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో కోకో తోట పంటల విస్తరణపై ఉద్యానశాఖ అధికారులు దృష్టిసారించాలని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. దీనివల్ల రైతు అదనపు ఆదాయం పొందడానికి అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లో కోకో క్లస్టర్ అభివృద్ధి కార్యక్రమంపై సమీక్ష జరిపారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 600 హెక్టార్లలో కోకో సాగు అయ్యేలా చూడాలని, అందుకు అనుగుణంగా లక్ష్యాలను నిర్దేశించుకోవాలని సూచించారు. రైతులను ప్రోత్సహించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అన్నారు. కొబ్బరి, ఆయిల్‌పామ్ పంటల్లో అంతరపంటగా వేసే కోకో తోటలపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. అలాగే మట్టి అవసరం లేకుండా వ్యర్థాల నుంచి తయారు చేసిన కంపోస్టుతో మొక్కలను పెంచే ప్రాజెక్టు గురించి కలెక్టర్ చర్చించారు. గృహ వ్యర్థాలు, ఆహార వ్యర్థాలు, మున్సిపల్ వ్యర్థాల సాయంతో తయారు చేసిన కంపోస్టు మొక్కల పెంపకానికి ఎలా ఉపయోగపడుతుందో కేరళకు చెందిన డాక్టర్ మనోజ్ వివరించారు. జిల్లా ఉద్యాన అధికారిణి సుజాత కుమారి, జిల్లా సూక్ష్మసేద్య అధికారి దుర్గేష్, జిల్లా పశు సంవర్థక అధికారి డాక్టర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

టీచర్ల బదిలీలపై సహాయానికి హెల్ప్‌డెస్క్

రాజమహేంద్రవరం అర్బన్, మే 22 (ఆంధ్రజ్యోతి) : టీచర్ల బదిలీలు, పదోన్నతులకు సంబంధించి రాజమహేంద్రవరం యూటీఎఫ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్‌ను సద్వినియోగం చేసుకోవాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎన్.అరుణకుమారి అన్నారు. గురువారం రాజమహేంద్రవరంలోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో హెల్ప్‌డెస్క్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పి.జయకర్, ఏ.షరీఫ్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులకు సంబంధించి ఉపాధ్యాయ సంఘాలు, ప్రభుత్వం మధ్య ఏర్పడిన ప్రతిష్టంభన తొలగి నిర్వహనకు షెడ్యూల్ విడుదల చేయడం ఆనందంగా ఉందని అన్నారు. ఈ క్రమంలో ఉపాధ్యాయులకు సందేహాలు నివృత్తి చేయడానికి, మార్గనిర్దేశనం చేయడానికి, అప్లికేషన్లు పెట్టుకునే సమయంలో సహాయం అందజేయడానికి రాజమహేంద్రవరంలోని జిల్లా కార్యాలయంతోపాటు ఉండ్రాజవరం, గోకవరం, నిడదవోలు, తదితర ప్రాంతాల్లో హెల్ప్‌డెస్క్‌లను ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు ప్రభాకర్ వర్మ, ప్రసాదరావు, యూటీఎఫ్ నేతలు, తదితరులు పాల్గొన్నారు.

మద్యం సేవించి వాహనం నడుపుతున్న కంటైనర్ డ్రైవర్‌పై కేసు

కొవ్వూరు, మే22 (ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి వాహనం నడుపుతున్న కంటైనర్ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్టు పట్టణ సీఐ పి.విశ్వం తెలిపారు. జార్ఖండ్‌కు చెందిన సనావుల్ ఖాన్ కాఫీ పౌడర్ లోడ్ చేసుకుని ఏలూరువైపు నుంచి వైజాగ్ వెళ్తున్నాడు. గురువారం కొవ్వూరు గామన్ బ్రిడ్జి టోలిగేట్ సీఐ తన సిబ్బందితో వాహన తనిఖీలు చేపట్టారు. సనావుల్ ఖాన్ అధికంగా మద్యం సేవించి ఉండడంతో అదుపులోకి తీసుకున్నారు. ఈమేరకు కేసు నమోదు చేసినట్టు ఆయన తెలిపారు.

బావమరిదిని నరికిన కేసులో వ్యక్తికి జైలు, జరిమానా

దేవరపల్లి, మే 22 (ఆంధ్రజ్యోతి): దేవరపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని రంగరాయ కాలనీ బంధపురం గ్రామానికి చెందిన షేక్ సయ్యద్ బాజీ తన భార్య కాపురానికి రావడం లేదనే కోపంతో దానికి కారణమైన తన బావమరిది షేక్‌కరీమ్‌ని కత్తితో 2017లో నరకగా, ఆయన ఫిర్యాదు మేరకు దేవరపల్లి పోలీస్‌స్టేషన్ నందు అప్పట్లో క్రైమ్ నెంబర్ 22/2017 అండర్ సెక్షన్ 30, 324 ఐపీసీ కింద కేసు నమోదు చేశారు. అనంతరం కొవ్వూరు ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్ కోర్టు నందు ఛార్జ్‌షీట్ ఫైల్ చేయగా సాక్షుల విచారణ అనంతరం కేసు రుజువు కావడంతో ముద్దాయికి గురువారం ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి జీవీఎల్ సరస్వతి నాలుగు సంవత్సరాలు జైలుశిక్ష, రూ.1500 జరిమానా విధించారు. ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీ కాకులపాటి వెంకటరమణ వాదించగా, ప్రాసిక్యూషన్‌కు ఎస్ఐ సుబ్రహ్మణ్యం, కోర్టు కానిస్టేబుళ్లు సహకరించారు.

యువతకు స్కిల్ హబ్‌లో ఉద్యోగ, ఉపాధి శిక్షణ

రాజమహేంద్రవరం కల్చరల్, మే 22 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్ భవన ప్రాంగణంలోని స్కిల్ హబ్ నందు రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్‌స్ట్రక్షన్ ద్వారా 18 నుంచి 45 సంవత్సరాల వయస్సు గల ఔత్సాహిక యువతకు అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్ వృత్తి శిక్షణ ద్వారా ఉపాధి అవకాశాలు కల్పించేందుకు శిక్షణ తరగతులు త్వరలో ప్రారంభమౌతాయని నాక్ అసిస్టెంట్ డైరెక్టర్ జున్నూరు రాజు , జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అర్బన్ స్కిల్ హబ్ కోఆర్డినేటర్ ఎన్.రాజా కాలేబ్ ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం వారిద్దరు మా ట్లాడుతూ నిర్ణీత వేళలలో బోధన , అన్ని రకాల ఎలక్ట్రికల్ ఇన్స్ట్రుమెంట్స్‌తో ప్రాక్టికల్స్‌తో కలిసి శిక్షణ ఉంటుందన్నారు. రెండు నెలల పాటు ఉంటుందన్నారు. అసిస్టెం ట్ ఎలక్ట్రీషియన్ కోర్సులో ప్రవేశానికి పదో తరగతి, ఆపై విద్యార్హత గలవారు అర్హుల న్నారు. ఈ కోర్సులో ప్రవేశం కోరే వారు నమోదు కోసం నాక్ సీనియర్ ఫ్యాకల్టీ మోత కనకదుర్గ మహాలక్ష్మిని లేదా 62811 14627, 9553794729 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

కాళేశ్వరం సరస్వతి పుష్కరాలకు రెండు సూపర్ లగ్జరీ బస్సులు

రాజమహేంద్రవరం అర్బన్, మే 22 (ఆంధ్రజ్యోతి) : కాళేశ్వరం సరస్వతి పుష్కరాలకు ఈనెల 22వ తేదీ సాయంత్రం రాజమహేంద్రవరం ఆర్టీసీ డిపో నుంచి రెండు సూపర్ లగ్జరీ బస్సులు బయలుదేరి వెళ్లినట్టు డిపో మేనేజర్ షేక్ షబ్నం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ యాత్రలో కాళేశ్వరం, ధర్మపరం, కొండగట్టు, వేములవాడ, వరంగల్, రామప్పక్షేత్రాల దర్శనం ఉంటుందన్నారు. తిరిగి 25వ తేదీకి బస్సులు రాజమహేంద్రవరం చేరుకుంటాయని ఆమె పేర్కొన్నారు.